నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
1
సోమవారం | సెప్టెంబర్ 09, 2024 | www.navatelangana.com

అధ్వానంగా మారిన రోడ్డు

నవతెలంగాణ-ఉట్నూర్



మండలంలోని ఎక్స్ రోడ్ నుండి జైనూర్ వరకు వెళ్లే జాతీయ రహదారి అధ్వానంగా మారింది. నిత్యం అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు ఈ రహదారి గుండనే వెళ్తుంటారు కానీ పట్టించుకునే వారే లేరు. హీరాపూర్ గ్రామ సమీపంలో ఉన్న గుంతలను గ్రామ ప్రజలు ప్రమాదం జరగకుండా రేకులతో గుంతలను మూసివేశారు. ప్రాణ నష్టం జరగక ముందే అధికారులు రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

పీపీఆర్ టీకాల శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-నేరడిగొండ



మండల కేంద్రంలోని పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శనివారం ఉచిత పీపీఆర్ టీకాల శిబిరాన్ని పశువుల ఆస్పత్రిలో ఏర్పాటు చేశారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై మేకలు, గొర్రెలకు టీకాలు వేసి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మేకలకు, గొర్రెలకు పీపీఆర్ నివారణ కోసం ఉచిత టీకాల శిబిరాన్ని పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీడీసీ చైర్మన్ రవీందర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ఏలేటి మహేందర్ రెడ్డి, మహమ్మద్ సద్దాం, మర్రిపల్లి లచ్చన్న, గోతి గులాబ్ సింగ్ , వడూర్ మాజీ ఎంపీటీసీ పండరి, సురేందర్ పాల్గొన్నారు.

వేతనం రాక..పూట గడవక..!

- తొమ్మిది నెలల నుంచి దరిచేరని జీతం • కుటుంబ పోషణకు అప్పులు చేస్తున్న వైనం • వాటికి వడ్డీలు చెల్లించలేక తీవ్రంగా సతమతం
- ఇబ్బందుల్లో తహసీల్దార్ కార్యాలయ కంప్యూటర్ ఆపరేటర్లు • ప్రభుత్వం, అధికారులు దృష్టిసారించాలని వేడుకోలు

క్రమం తప్పకుండా ఒకటో తారీఖు వచ్చే వేతనం ఒకటి, రెండు రోజులు ఆలస్యమైతే గాబరపడిపోతుంటాం. వివిధ ఖర్చులకు నెలవారీ చెల్లింపుల్లో ప్రభావం పడుతుంది. అలాంటిది ఏకంగా తొమ్మిది నెలల నుంచి జీతం రాకపోతే పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. వేతనం రాకపోవడంతో పూట గడవని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు జిల్లాలోని తహసీల్దార్ కార్యాలయాల్లో పనిచేస్తున్న టైపిస్టు కం కంప్యూటర్ ఆపరేటర్లు. గత పదిహేనేండ్ల నుంచి పనిచేస్తున్న వీరికి ఏ రోజు సక్రమంగా వేతనం రాలేని పరిస్థితి ఉందని వాపోతున్నారు. ప్రభుత్వం నుంచి బడ్జెట్ రావడం లేదనే కారణంతో గుత్తేదారు సైతం వీరికి వేతనాలు ఇవ్వడంలేదు. దీంతో వేతనం రాక..పూట గడవక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కుటుంబ పోషణ కోసం అప్పులు తీసుకొచ్చి వాటికి నెలనెలా వడ్డీలు చెల్లించాల్సిన పరిస్థితి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

జిల్లాలోని తహసీల్దార్ కార్యాలయాల్లో పనిచేస్తున్న టైపిస్టు కం కంప్యూటర్ ఆపరేటర్ల పరిస్థితి దయనీయంగా మారింది. నెలల తరబడి వేతనాలు రాక కుటుంబ పోషణ కష్టంగా మారుతోంది. ఇతరుల వద్ద అప్పులు చేస్తూ ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నారు. జిల్లాలో 18 మండలాల్లోని ఒక్కో తహసీల్దార్ కార్యాలయంలో ఒక్కొక్కరు కంప్యూటర్ ఆపరేటర్ పనిచేస్తున్నారు. రెండు ఆర్డీఓ కార్యాలయాల్లోనూ వీరు సేవలందిస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో 20మంది వరకు పనిచేస్తున్నారు. వీరిని గత పదిహేనేండ్ల క్రితం రెవెన్యూ భూపరిపాలనశాఖ (సీసీఎల్ఏ) పరిధిలో ఒప్పంద ప్రతిపాధికన నియమించారు. ఒప్పంద ప్రతిపాధికన పనిచేస్తున్నారు. వీరికి వేతనాలు అందించే బాధ్యతను ఓ అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీకి అప్పగించింది. కార్యాలయంలో ఉదయం 10గంటల నుంచి రాత్రి వరకు విధులు నిర్వర్తిస్తున్నారు. కుల, ఆదాయ ధ్రువపత్రాలతో పాటు కార్యాలయం పరిధిలోకి వచ్చే అన్ని రకాల సర్టిఫికేట్లను వీరే నమోదు చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం అప్పగించే వివిధ సర్వేలు, నివేదికలకు సంబంధించిన సమాచారాన్ని నమోదు చేస్తుంటారు. కులగణనతో పాటు ఓటరు నమోదు ప్రక్రియలోనూ కీలకంగా వ్యవహరిస్తుంటారు. ఇటీవల ప్రజాపాలన దరఖాస్తులను సైతం రాత్రింబవళ్లు కష్టపడి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. కానీ వేతనాలు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలానికి సంబంధించి అధికారులు అడిగిన ప్రతి రిపోర్టును వీరే తయారుచేయాల్సి ఉంటుంది. ఇంతటి కీలక పనిలో ఉన్న వీరి పట్ల అటు ప్రభుత్వం, ఇటు అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అప్పులు తీసుకొచ్చి అవస్థలు పడుతూ..!

చేసిన పనికి జీతం రాక..కుటుంబ పోషణ కష్టంగా మారడంతో గత్యంతరం లేని పరిస్థితిలో అప్పులు చేయాల్సి వస్తోందని ఆపరేటర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేసిన అప్పులకు వడ్డీలు పెరిగిపోతుండటం వీరిని తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ఆరోగ్యం బాగాలేకపోతే చేతిలో డబ్బులు లేక కనీసం ఆస్పత్రిలో కూడా చూయించుకోలేని పరిస్థితి ఉందని వాపోతున్నారు. ప్రభుత్వం ప్రతి నెల బడ్జెట్ విడుదల చేయగానే కంప్యూటర్లకు వేతనాలు అందించాల్సి ఉంటుంది. కానీ ప్రభుత్వం నుంచి బడ్జెట్ విడుదల కావడం లేదనే కారణంగా సంబంధిత గుత్తేదారు వీరికి వేతనాలు అందించడం లేదు. దీంతో కుటుంబ అవసరాలకు డబ్బులు లేక ఆపరేటర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏకంగా తొమ్మిది నెలల నుంచి జీతం రాకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇతరుల వద్ద అప్పులు తీసుకొచ్చి వాటికి వడ్డీలు చెల్లించలేక సతమతమవుతున్నట్లు వాపోతున్నారు. అడిగితే ఎక్కడ విధుల నుంచి తొలగిస్తారో అనే భయంతో మిన్నకుండిపోతున్నారు. మరోపక్క ఏండ్లుగా పనిచేస్తున్న తమకు పేస్కేల్ వర్తింపజేయాలని, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వమే వేతనాలు ఇచ్చే పద్ధతిని తీసుకురావాలని కోరేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తమకు ప్రతి నెలా వేతనాలు వచ్చేలా చూడాలని కోరుతున్నారు.

సిలెండర్ లీకేజీతో తప్పిన ప్రమాదం

నవతెలంగాణ-ముధోల్



మండలంలోని చించాల గ్రామానికి చెందిన గట్టుపెల్లి సాగర అనే మహిళ ఆదివారం ఉదయం ఇంటిబయట సిలెండర్‌పై వంట చేస్తుండగా ఆకస్మికంగా సిలెండర్ లీకేజ్ అయింది. దీంతో మంటలు చెలరేగాయి. దీంతో బయటకు పరుగులు తీశారు. పెద్ద శబ్దం రావటంతో చుట్టుపక్కల వారు వచ్చి మంటలు ఆర్పివేశారు. అప్పటికే సిలెండర్‌పై ఉన్న వంట పాత్ర వేడికి కొంత బాగం కరిగిపోయింది. ఇంటి బయట కరెంట్ వైరింగ్ కాలిపోయింది. ఇంటి బయట వంట చేయడంతో పేను ప్రమాదం తప్పింది. అయితే ఈ సిలెండర్ ఇటివలే బైంసా కృప గ్యాస్ ఏజెన్సీ నుండి సిలెండర్ తెచ్చినట్లు బాధిత కుటుంబసభ్యులు తెలిపారు. సిలిండర్ లీకేజీతోనే ఈ ప్రమాదం జరిగిందని తెలిపారు.

నష్ట పోయిన రైతులను ఆదుకుంటాం

- కాంగ్రెస్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ



నవతెలంగాణ-ఉట్నూర్

ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులు అధైర్యపడవద్దని ప్రభుత్వం ఆదుకుంటుందని కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆత్రం సుగుణక్క రైతులకు భరోసానిచ్చారు. శనివారం మండలంలోని పులిమడుగు గ్రామాన్ని సందర్శించి వరదలకు దెబ్బతిన్న పంట పొలాలు, రహదారులు, కల్వర్టులను పరిశీలించారు. రైతులతో మాట్లాడి గ్రామంలో పంట నష్టాన్ని తెలుసుకున్నారు. పంట కోల్పోయిన రైతులు అధైర్యపడవద్దని, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించి అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎస్టీ సెల్ రాష్ట్ర కన్వీనర్ సునీల్ జాదవ్, మాజీ సర్పంచ్ సరిత శ్రీనివాస్ జాదవ్, రాజలింగు, విష్ణు, బలిరామ్, ఆడే సురేష్, భూమన్న, ఆడే ప్రవీణ్, రాథోడ్ సురేష్, ఆడే హన్ను సింగ్, రాథోడ్ రాజు, సుంకే రాజేశ్వర్, శేషారావు చౌహన్ పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీని పరామర్శించిన నాయకులు



నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రానికి చెందిన మాజీ ఎంపీటీసీ కుర్మే మహేందర్, అపేపు కిరణ్ ఇటీవల మోటార్ సైకిల్‌పై నుంచి ప్రమాదవశాత్తు పడి గాయపడ్డారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఏలేటి అశ్విన్ రెడ్డి పర్మించారు. ప్రమాదకలకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మండల నాయకులు నల్ల శ్రీకాంత్ రెడ్డి, మెరుగు భోజన్న, బారే నాగేందర్ , గుడల అనీష్, మహేష్ ఉన్నారు.

దహన సంస్కారాలకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం



నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని దొంగచింత(భీంజీగూడా) గ్రామానికి చెందిన కుమ్ర మాధవరావు శనివారం తెల్లవారుజామున మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా మండల కమిటీ సభ్యులు మాధవరావు అంత్యక్రియలకు కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందించిన ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులున్నారు.

ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-ఉట్నూర్



జైనూర్ మండలం పుల్లర గ్రామానికి చెందిన మర్సుకోల కృష్ణ రాయచూర్‌లోని యూనివర్సిటీలో ఐఐఐటీ సీటు సాధించుకున్నాడు. ఆర్థిక స్తోమత లేక వెళ్ళలేని పరిస్థితిలో ఉన్న నిరుపేద ఆదివాసీ బిడ్డకు మేము ఉన్నామని పలువురు ముందుకు వచ్చి ఆర్థిక సాయాన్ని శనివారం ఉట్నూర్‌లోని కేబీ కాంప్లెక్స్‌లో అందజేశారు. సార్మేడి మేస్రం దుర్గు చేతుల మీదుగా ప్రిన్సిపాల మెస్రం మనోహర్ ఆధ్వర్యంలో రూ. 60వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో అభిమన్యు గ్రూప్ అడ్మిన్ మెస్రం శేఖర్ బాబు, పెందోర్ దీపక్, మేస్రం రూపుదేవ్ పటేల్, మేస్రం లింగు, మేస్రం గంగారాం, కనక రామారావు, జగన్, యువకులు విష్ణు, ఆత్రం సంతోష్ ,పెందూర్ జలీమ్, ఆత్రం నాగోరావ్, విజయ్, అవినాష్, కేశవ్ మేస్రం ఉన్నారు.

రైతులు ఆధైర్య పడొద్దు..అండగా ఉంటా..

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ • నష్టపోయిన పంటలను పరిశీలించిన బొజ్జు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



పంటలు నష్టపోయిన రైతులు ఆధైర్యపడొద్దని, అండగా ఉంటు పరిహారం వచ్చేల కృషి చేస్తానని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఆదివారం మండలంలోని దోడంద, గట్టే పల్లి తదితర గ్రామాల్లోని పంట క్షేత్రల్లో తిరుగుతూ పంట నష్టం గురించి తెలుసుకున్నారు. రైతులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులెవ్వరు ఆధైర్య పడొద్దని వారికి అండగా ఉంటానని భరోసా కల్పించారు. నష్టపోయిన పంటల వివరాలను వ్యవసాయ అధికారులతో సర్వే నిర్వహించి రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తా నన్నారు. రైతు రుణ మాఫీపై ఎలాంటి ఆందోళన చెందవద్దని సూచించారు. బీఆర్ఎస్, బీజేపీలు ప్రజలకు మభ్యపెడుతున్నారని, వారి మాటలను నమ్మొద్దని కోరారు. భారీ వర్షాల వల్ల నష్టపోయిన పంటలతో పాటు కోతకు గురైన రోడ్లు, వంతెనలను మరమ్మత్తులు చేపట్టుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.ప్రవీణ్, నాయకులు పటేల్ దొంగుర్‌గావ్, దూధ్‌రామ్ పాల్గొన్నారు.

సాంకేతిక లోపాల కారణంగా రుణమాఫీ కాలేదు

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-ఉట్నూర్

రుణమాఫీ కానీ రైతులు ఆందోళన చెందొద్దని, ప్రతి రైతుకు రూ.రెండు లక్షలలోపు రుణమాఫీ చేసే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఆదివారం మండలంలోని నర్సపూర్(బి), గండిగూడా గ్రామాలలో అధికారులతో కలసి ఆయన పర్యటించారు. ముందుగా గ్రామంలో కొలుదిరిన గణనాథుడికి పూజలు చేశారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రుణమాఫీ విషయంలో రైతులు ఆందోళన చెందొద్దని, సాంకేతిక కారణాల వల్ల సమస్య తలెత్తిందని తెలిపారు. త్వరలో రూ..రెండు లక్షలలోపు రుణాలు కలగిన రైతులకు రుణమాఫీ చేస్తామని భరోసా ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాలు, పంట పొలాలలో కరెంటు కోతలు విధించకుండా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటల వివరాలను గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. త్వరలో పంట నష్టపోయిన రైతులను గుర్తించి వారికి పరిహారం అందేలా చర్యలు చెపడతామని తెలిపారు. గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గ్రామాలలో నెలకొన్న సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

గణపతిని పూజించుకోవడం సనాతన ఆచారం

- మట్టి విగ్రహాలను పంపిణీ చేసిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



హైందవ ధర్మంలో ఏ పనిని ప్రారంభించినా ముందుగా గణపతిని పూజించుకోవడం సనాతనంగా వస్తున్న ఆచారమని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. వేల సంవత్సరాలుగా కొనసాగుతున్న ఆచారాన్ని, సాంప్రదాయ పండుగలను భావితరాలకు సంస్కృతిని అందించేలా జరుపుకోవడం అభినందనీయమన్నారు. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో శనివారం చేపట్టిన మట్టి వినియాక ప్రతిమల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. స్థానిక గోపాల కృష్ణమఠంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మఠాధిపతి యోగానంద సరస్వతి, సమితి ప్రతినిధులతో కలిసి ప్రజలకు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులనే ప్రతిష్ఠించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి, ప్రధాన కార్యదర్శి మాధవ్, వామన్, రవీందర్, శశికళ చౌహన్, బీజేపీ నాయకులు ఆకుల ప్రవీణ్, లాలామున్న, కాసర్ల శ్రీనివాస్, లచ్చు, సంతోష్, విజయ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరికలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



కాంగ్రెస్ పేద, బడుగు బలహీన వర్గాల పార్టీ అని వారి అభ్యున్నతి, సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని, ఆ పార్టీ ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం ప్రజాసేవా భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ జహీర్ రంజాని ఆధ్వర్యంలో ఖురేషీ సంఘం సభ్యులు పలువురు ఆయన సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కంది శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పదేండ్ల బీజేపీ, బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు ఎలాంటి న్యాయం జరగలేదన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం వంటగ్యాస్ ధరలను రూ.12 వందలకు పెంచిందని, డబుల్ బెడ్ రూం పథకం పేరుతో ఓట్లు దండుకున్న బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో ఒక్క ఇల్లు కూడా పంపిణీ చేయలేక పోయిందని ఎద్దేవా చేశారు. కానీ ఇచ్చిన మాటకు కట్టుబడి ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు లోక ప్రవీణ్‌రెడ్డి, ఆవుల వెంకన్న, సంద నర్సింగ్, ఇమ్రాన్, ఎంఏ ఖయ్యుం, రఫీక్, అశోక్, అతిక్ ఉర్ రెహ్మాన్ దాసరి ఆశన్న, సంతోష్, గంగుబాయి పాల్గొన్నారు.

స్వర్ణ ప్రాజెక్టు గేటు ఎత్తివేత

- రాత్రి వేళలో మరిన్ని గేట్లు ఎత్తనున్న నీటి పారుదల అధికారులు



నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని స్వర్ణ ప్రాజెక్టు ఎగువ భాగాన కురుస్తున్న వర్షానికి 1969 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతుంది. ప్రాజెక్టు సామర్థ్యం 1183 అడగులకు గాను 1182 పూర్తిస్థాయి అడుగులకు చేరుకోవడంతో నీటి పారుదల శాఖ అధికారులు ఆదివారం ఒక గేటు ఎత్తి 1989 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. నీటి ప్రవాహం పెరుగుతే అవసరాన్ని బట్టి మరిన్ని గేట్లు ఎత్తి నీటిని విడుదల చేయడం జరుగుతుందన్నారు.అలాగే కుడి, ఎడుమ, మధ్య జౌలి నాలల ద్వారా 80 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. వాతావరణ శాఖ తెలిపిన వివరాల ప్రకారం మరో రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున నదీ పరివాహక ప్రాంతం గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



నవతెలంగాణ-బోథ్

మండలంలోని పాట్నాపూర్ గ్రామానికి చెందిన తొడసం భూమన్న ఉపాధ్యాయుడికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడంతో పాట్నాపూర్ గ్రామస్తుల ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మానం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ అప్క కిషన్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో నిబద్ధతగా పనిచేస్తూ, విద్యార్థుల తోటి ఉపాధ్యాయుల, అధికారుల, గ్రామస్తుల మన్ననలు పొందుతూ వృత్తికె వన్నె తీసుకొచ్చిన భూమన్న ఉపాధ్యాయులందరికి ఆదర్శంగా నిలుస్తారని అన్నారు. భవిష్యత్తులో మరెన్నో ఉన్నత శిఖరాలకు ఎదగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు పంద్రం సుగుణ, తొడసం గోపాల్, ఉపాధ్యాయులు పెందూర్ సోనేరావు, మడావి లాల్‌దేవ్, తొడసం గంగారాం, గ్రామ పటేళ్ల యువజన సంఘాల నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

దళితులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

నవతెలంగాణ-నిర్మల్



నిర్మల్ జిల్లా తానూరు మండలంలోని ఝరి గ్రామంలో 7న రాత్రి బుద్ధ విహార్‌లో వర్షవాస్ కార్యక్రమంలో పాల్గొన్న దళితులపైన దాడి చేసిన వారిని పట్టుకొని కఠినంగా శిక్షించాలని అంబేద్కర్ యువజన సంఘం జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆదివారం ఆర్ అండ్ బి విశ్రాంతి భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కుంటోళ్ల వెంకటస్వామి మాట్లాడారు. దళితులపై రాళ్ల దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. రానున్న 24 గంటలలో నిందితులను గుర్తించి వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు కొంతం మురళి, బత్తుల రంజిత్, బొడ్డు లక్ష్మణ్, పురుషోత్తం, రవీందర్, మధుకర్ మునేశ్వర్ పాల్గొన్నారు.

2
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
సోమవారం | సెప్టెంబర్ 09, 2024 | www.navatelangana.com

పేదలకు వైద్య సేవలను అందించడానికి ముందుకు వచ్చాం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వర్షకాలం సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో ఉచితంగా పేదలకు వైద్య సేవలను అందించడానికి ముందుకు వచ్చామని మమత ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అల్టర్‌నేటివ్ మెడిసిన్ ప్రిన్సిపల్, డైరెక్టర్ డాక్టర్ మిర్జా అహ్మద్ బేగ్ అన్నారు. హుమెన్ రైట్స్, మమత ఇన్‌స్టిట్యూట్, ఆల్ హజ్ మసుమ్ అలీ ట్రస్ట్ ఆధ్వర్యంలో పట్టణంలోని శాంతినగర్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రోగులను పరిశీలించి వారికి ఉచితంగా మందులతో పాటు సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. అక్కడి నుంచి షాద్‌నగర్‌లోని మమత ఇన్‌స్టిట్యూట్‌ను సందర్శించారు. అక్కడ వైద్యుడు ఫైముల్లను సత్కరించారు. వర్షకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని, పేదలు ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకొని, వారి సహాయర్థం ఉచత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశామని అన్నారు. వర్షకాలంలో వ్యాధులు వ్యాప్తి చెందకుండా ప్రజలు కూడా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జాఫర్, వైద్య సిబ్బంది ఉన్నారు.

కొట్టుకుపోయిన రోడ్డు.. రాకపోకలకు ఇబ్బందులు..

నవతెలంగాణ-నార్నూర్



ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గాదిగూడ మండలంలోని బొడ్డిగూడ గ్రామపంచాయతి పరిధిలోని చిత్తగూడ గ్రామ సమీపంలో ఉన్న కల్వర్ట్ రోడ్డు పూర్తిగా వర్షంతో కొట్టుకుపోయింది. దీంతో అటుగా వెళ్లే గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి అత్యవసర పనులకు రావాలంటే ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాల పనులకు, ఆస్పత్రికి పోవాలంటే వాహనాలు నడవలేక ఇబ్బందులు తప్పడం లేదని వాపోయారు. రోడ్డు పూర్తిగా ధ్వంసమవ్వడంతో గ్రామప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు దృష్టి సారించి త్వరగా రోడ్డు మరమ్మతు పనులు చేట్టాలని కోరుతున్నారు.

కోతకు గురైన రోడ్లకు మరమ్మత్తులు చేస్తాం

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-కడెం

భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న రోడ్లకు మరమ్మత్తులు చేస్తామని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఆదివారం మండలంలోని చింతగూడ1, చింతగూడ2, అల్లంపెల్లి, గుర్రమధిర, పాల్‌రెగడి, మథురా తండా, మంగల్‌సింగ్ తండా, మీసల భూమన్న గూడం, గంగన్న పేట, తదితర గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి, కోతకు గురైన రోడ్లను, కల్వర్టను పరిశీలించారు. పలువురిని పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కురిసిన భారీ వర్షాల కారణంగా తీవ్ర నష్టం వాటిల్లిందని, ప్రజలు, రైతులు ఆందోళన చెందొద్దన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నష్టపోయిన వారిని అన్ని విధాలుగా ఆదుకుంటుందని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్దే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గ్రామాలలో నెలకొన్న సమస్యలను దశల వారిగా పరిష్కారం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షులు తుమ్మల మల్లేష్ యాదవ్, నిర్మల్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పొద్దుటూరి సతీష్‌రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు తారిశంకర్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సొసైటీ ఆధ్వర్యంలో అన్నదానం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ రూరల్ మండలంలోని పొచ్చర గ్రామానికి శ్రీరామ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమంలో భాగంగా రిమ్స్ లోని సత్యసాయి నిత్యాన్నదాన సత్రంలో అన్నదానం చేశారు. ఆదివారం సత్రంలో ముందుగా సత్యసాయి చిత్రపటం వద్ద పూజలు చేశారు. అనంతరం రోగి సహయకులకు భోజనం వడ్డించారు. సేవా కార్యక్రమాల్లో స్వచ్ఛంద సంస్థలు ముందుండాలని, తమ సొసైటీ ఆధ్వర్యంలో భవిష్యత్తులో మరిన్ని సేవ కార్యక్రమాలు చేపడుతామని అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటి ప్రధాన కార్యదర్శి గంగారెడ్డి, కోశాధికారి ఎం.రాకేష్, ఉపాధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి మధుకర్‌రెడ్డి, సభ్యులు రవీందర్, పురుషోత్తం, సతీష్, యోగేష్, హరీష్, అంకిత్, సాంబశివ పాల్గొన్నారు.

శాంతియుత వాతావరణంలో పండుగలు నిర్వహించాలి

- డీఎస్పీ నాగేందర్



నవతెలంగాణ-నార్నూర్

శాంతియుత వాతావరణంలో పండుగలు నిర్వహించుకోవాలని డీఎస్పీ నాగేందర్ సూచించారు. ఆదివారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో వివిధ వర్గాల నాయకులతో సమావేశం నిర్వహించారు. అలర్లు సృష్టించకుండా ప్రశాంతంగా వినాయక చవితి ఉత్సవాలు జరుపుకోవాలని కోరారు. సమావేశంలో సీఐ రహీమ్ పాషా, జిల్లా సార్మేడి దుర్గు పటేల్, మండల ఆదివాసీ నాయకులు తొడసం నాగోరావ్, యుర్వేత రూపదేవ్ మండలంలోని ఆయా గ్రామాల ఆదివాసీ నాయకులు ఉన్నారు.

చెస్ ఆటతో మెరుగుపడనున్న మేధోశక్తి

- అట్టహాసంగా జిల్లాస్థాయి చెస్ పోటీలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

చెస్ ఆడటం వల్ల ఒత్తిడి తగ్గడంతో పాటు మేధోశక్తి పెరుగుతుందని చెస్ జిల్లాస్థాయి పోటీల కన్వీనర్, శ్రీచైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఓ పాఠశాలలో అండర్- 11 బాలిబాలికల జిల్లాస్థాయి చెస్ పోటీలను నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్యఅథితిగా హాజరై పోటీలను ప్రారంభించారు. జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు ఈనెల 14, 15 తేదిల్లో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర పోటీల్లో పాల్గొనున్నారు. చదువుతో పాటు ఆటల్లో కూడా విద్యార్థులు ప్రావీణ్యం సాధించాలని, చెస్ పోటీల కన్వీనర్ శ్రీనివాస్ అన్నారు. ఈ కార్యక్రమంలో చెస్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి నన్నపు స్వామి, సభ్యులు విఠల్, నాందేవ్, రాంకుమార్, జయశ్రీ, అథ్లెటిక్ కార్యదర్శి రాజేష్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటునందించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తోడ్పాటునందించాలని ఆదిలాబాద్ మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ కోరారు. శనివారం వినాయక ఉత్సవాల సందర్భంగా మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని వార్డుల్లో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేపట్టారు. మున్సిపల్ సిబ్బందితో కలిసి ఇంటింటికీ మట్టి విగ్రహాలను అందించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వంటి వినాయకులతో పాటు కెమికల్ రంగులను వాడవద్దని సూచించారు.

కుమురంభీం, చాకలి ఐలమ్మ విగ్రహాల ఆవిష్కరణ

- పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యేలు



నవతెలంగాణ-తలమడుగు

మండల కేంద్రంలో కుమురంభీం, చాకలి ఐలమ్మ విగ్రహాలను ఆదివారం ఎంపీ నగేష్, ఎమ్మెల్యేలు అనిల్ జాదవ్, పాయల శంకర్ వెడ్మ బొజ్జు పటేల్ విగ్రహాలను ఆవిష్కరించారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఎంపీ గోడం నగేష్ మాట్లాడుతూ గతంలో ఎంపీ, ఎమ్మెల్యేగా పనిచేసిన కాలంలో మండలానికి కోట్లాది రూపాయలు నిధులు తెచ్చి రోడ్లు పాఠశాల భవనాలతో పాటు అంబేద్కర్ భవనాలు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. కుమురంభీం, చాకలి ఐలమ్మ నైజం, బ్రిటిష్ పరిపాలనకు వ్యతిరేకంగా పోరాడిన వీర యోధులని అన్నారు. మాజీ మంత్రి బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న మాట్లాడుతూ జల్.. జంగల్.. జమీన్.. అనే నినాదంతో ముందుకు వచ్చి ఆదివాసులకు ఆదర్శంగా నిలిచిన పోరాటయోధుడని తెలిపారు. వారి ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. త్యాగ పురుషుల జయంతులు, వర్ధంతులు చేసుకోవడమే కాకుండా వారి బాటలో నడవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలు చదివే గొప్ప ఆయుధమని ఈ సందర్భంగా తెలిపారు. ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ పోరాట యోధులను వారి స్ఫూర్తిని తీసుకొని ముందుకు నడవాలన్నారు. జైనూర్‌లో జరిగిన సంఘటన ఆదివాసులను ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. విగ్రహాలను నెలకొల్పడమే కాకుండా వారి పోరాట మార్గంలో నడవాలని కోరారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ నైజాం పరిపాలనకు వ్యతిరేకంగా పోరాడిన కుమురంభీం, వీరానారి చాకలి ఐలమ్మలకు కేసీఆర్ ప్రభుత్వం హయాంలో తగిన ప్రాధాన్యతను ఇచ్చారని అన్నారు. ఆదివాసులకు అటవీహక్కు పత్రాలు అందించినట్టు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీలు గోక గణేష్‌రెడ్డి, సుధాకర్, కాంగ్రెస్ మండల నాయకులు రాజేశ్వర్, ఇచ్చోడ ఎంపీపీ ప్రీతంరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు సంతోష్, పిడుగు సంజీవరెడ్డి, కాటేపల్లి వసంత్‌రెడ్డి, తోట వెంకటేష్, ముడుపు కేధారేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ చంటి, మౌనిష్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఆశన్న యాదవ్, బీసీ నాయకులు రవికాంత్ యాదవ్, జక్కుల ఆశన్న, ఎడిపెల్లి లింగన్న, భూమన్న, ఆదివాసి నాయకులు, పెందూరు మాధవరావు, అశోక్, జ్ఞానేశ్వర్, ధర్మ, రాంబాయి, రమేష్, దాంజి పటేల్, వివిధ గ్రామాల ఆదివాసులు, రజక సంఘ నాయకులు పాల్గొన్నారు.

వరద నష్టాల అంచనాలను సిద్ధం చేయాలి

నవతెలంగాణ-నిర్మల్



భారీ వర్షాలు, వరదలతో దెబ్బతిన్న రహదారులు, బ్రిడ్జిలు, పంటలకు జరిగిన నష్టంపై అంచనాలను సిద్ధం చేయాలని, జిల్లా ప్రత్యేకాధికారి భవేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు. ఆదివారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఇటీవల జిల్లాలో కురిసిన భారీ వర్షాలు, వరదలతో దెబ్బతిన్న పంటలు, రహదారులు, నివాస గృహాలు, శాఖల వారీగా జరిగిన నష్టంపై జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌తో కలిసి ఆయన అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రత్యేకాధికారి మాట్లాడుతూ భారీ వర్షాలు, వరదలతో జరిగిన నష్టంపై అంచనాలతో రిపోర్టలను తయారు చేయాలని ఆదేశించారు. భారీ వరదలతో జిల్లాలో ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా కృషి చేసిన కలెక్టర్, జిల్లా యంత్రాంగాన్ని ఆయన అభినందించారు. పంటలు నష్టపోయిన రైతులకు, నివాస గృహాలు పాక్షికంగా, పూర్తిగా కూలిపోయిన బాధితులకు పూర్తి సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. శిథిలావస్థలో ఉన్న ఇంటిలో నివాసం ఉంటున్న వారిని వెంటనే ఖాళీ చేయించాలని సూచించారు. రోడ్లు భవనాలు, పంచాయతీరాజ్ శాఖలకు సంబంధించి రహదారులు, బ్రిడ్జిలకు జరిగిన నష్టాన్ని పక్కాగా నమోదు చేసి రిపోర్టులను అందజేయాలని ఆదేశించారు. పాఠశాలలు, పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాలకు తదితర వాటికి సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి జరిగిన నష్టం వివరాల రిపోర్టును అందజేయాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా భారీ వర్షాలకు శాఖల వారిగా జరిగిన నష్టాన్ని వివరించారు. జిల్లాలో సెప్టెంబర్ 1న 127మీమీ, 2న 86మిమీ, 3న 90మీమీ వర్షపాతం నమోదయిందని తెలిపారు. భారీ వర్షాలు, వరదలతో కుభీర్, బైంసా, మామడ, కడెం, లక్ష్మణ చందా మండలాలలో అధిక నష్టం జరిగిందని వివరించారు. జిల్లాలోని గడ్డన వాగు, కడెం, స్వర్ణ ప్రాజెక్టులలో భారీ వరదలతో ఇన్‌ఫ్లో పెరగడంతో గేట్లు ఎత్తి దిగువకు నీరును విడుదల చేయడం జరిగిందని వివరించారు. పరివాహక ప్రాంత గ్రామాల ప్రజలకు ముందస్తు సమాచారం అందించడంతో ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరుగకుండా చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. జిల్లాలో భారీ వర్షాలతో 966 హెక్టర్లలో పాక్షికంగా వివిధ పంటలకు నష్టం జరిగిందని, వ్యవసాయ శాఖ ద్వారా పూర్తి సమాచారం సేకరించేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. పంచాయతీరాజ్‌శాఖ 75 రహదారులు పాక్షికంగా దెబ్బతిన్నాయని తెలిపారు. అలాగే రోడ్డు భవనాల శాఖ 30 రహదారులకు వరదతో నష్టం వాటిల్లిందని తెలిపారు. భారీ వర్షం నమోదైన మండలాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్ సెంటర్లలో వర్షపు నీరు చేరడంతో రోగులకు సమీప ఆస్పత్రులకు తరలించి, వైద్య చికిత్సలను అందించడం జరిగిందని తెలిపారు. విద్యాశాఖ 117 పాఠశాలలలో స్లాబ్ లీకేజీ, ప్రహరి గోడలు కూలిపోవడం జరిగిందన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపట్టిన పనులను ఇప్పటివరకు 75 శాతం పూర్తి చేయడం జరిగిందని మిగిలిన పనులను వెంటనే పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపాలిటీల పరిధిలో భారీ వర్షాలతో దెబ్బతిన్న సీసీ రోడ్లు, మురుగునీటి కాలువలు, నష్టం జరిగిన పురాతన భవనాలు ఇతర అంశాలను వివరించారు. విద్యుత్ శాఖ ద్వారా భారీ వర్షాలతో 83 పోల్స్ నష్టం జరిగితే ఇప్పటి వరకు 63 పోల్స్‌ను సరిచేసి నిరంతరం విద్యుత్ సరఫరా చేయడం జరిగిందని తెలిపారు. అలాగే భారీ వర్షాలతో కొన్ని చోట్ల మిషన్ భగీరథ పైప్‌లైన్ పక్షికంగా దెబ్బతిన్నదని వివరించారు. జిల్లాలో భారీ వర్షాలతో శాఖల వారీగా జరిగిన నష్టాన్ని క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టి అంచనాలతో పూర్తి నివేదికనకు సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ జిల్లా ప్రత్యేక అధికారికి వివరించారు. అంతకుముందు భారీ వర్షాలతో దెబ్బతిన్న రహదారులు, డ్రైనేజీలు, బ్రిడ్జిలు, నివాస గృహాలకు సంబంధించిన ఫోటో ఎగ్జిబిషన్‌ను జిల్లా ప్రత్యేకాధికారి, కలెక్టర్ తిలకించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, డీఆర్ఓ భుజంగరావు, ఆర్డీఓలు రత్న కళ్యాణి, కోమల్‌రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జైనూర్ ఘటనలో ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోంది



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జైనూర్‌లో గిరిజన మహిళపై అత్యాచార యత్నం దాడి కేసులో హిందూ వర్గాన్ని టార్గెట్‌గా చేసుకొని కక్షపూరితంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఆరోపించారు. ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ జైనూర్ ఘర్షణ కేసులో ఆదివాసీ యువకులపై అకారణంగా కేసులు నమోదు చేసి, ప్రభుత్వం జైలుకు పంపుతోందని అన్నారు. గత ఆరు నెలల కిందట జరిగిన ఘర్షణ ఆఫీసులో 400 మంది యువకులు నారాయణతో బెదిరించి దాడులు చేస్తే, నిందితులను కాపాడి బాధితులపై కేసులు చేశారని అన్నారు. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించడం మానుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హిందువులను టార్గెట్‌గా చేసుకొని రాజకీయ పబ్బం గడుపుకునేందుకు ప్రభుత్వం మరో వర్గాన్ని కాపాడుతుందని విమర్శించారు. అమాయక ఆదివాసులపై కేసులో నమోదు చేస్తే శాంతి భద్రతలకు విఘాతం ఏర్పడుతుందని అన్నారు. దేశ సరిహద్దుల్లో పనిచేసే ఓ జవాన్ కుటుంబానికి చెందిన బట్టల షాపును దుండగులు తగలబెట్టారని, ఆయన అక్కడి నుంచి ఫోన్‌లో తన ఆవేదన వ్యక్తం చేశారని అన్నారు. తన కుటుంబానికి రక్షణ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో నాయకులు ఎగ్రాల నగేశ్, లాలా మున్న, రఘుపతి, జోగు రవి, దినేష్ మాటోలియ, శ్రీనివాస్, శివ, సాయి పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ ఇన్‌చార్జి వీసీపై విజిలెన్స్ విచారణ జరిపాలి

నవతెలంగాణ-ముథోల్

బాసర ట్రిపుల్ ఐటీ ఇన్‌చార్జి వీసీగా వెంకట రమణ తన రెండేండ్ల, పదవీ కాలంలో చేసిన అవినీతి, అక్రమాలు నకిలీ బిల్లుల చెల్లింపుల మీద రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ విచారణ చెప్పట్టాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఉస్మానియా జేఏసీ అధ్యక్షులు సర్దార్ వినోద్ కుమార్ ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో సంప్రదాయ యూనివర్సిటీలకు పర్మనెంట్ వీసీలను నియమిస్తున్నట్టే, బాసర ట్రిపుల్ ఐటీ చట్టాన్ని మార్పులు చేసి ట్రిపుల్ ఐటీకి కూడా పర్మనెంట్ వీసీని నియమించాలని డిమాండ్ చేశారు. నాడు కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అనేక అక్రమాలకు పాల్పడిన ఇన్‌చార్జి వీసీ వెంకట రమణ మీద సత్వరమే చర్యలు చేపట్టాలని ఆయన పేర్కొన్నారు. బాసర ట్రిపుల్ ఐటీ ఇన్‌చార్జి వీసీ విద్యార్థి వ్యతిరేకి కావటంతో ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు అంక్షల పేరుతో, మెస్ కాంట్రాక్టర్లతో కుమ్మక్కై, నాసిరకమైన భోజనం పెడుతూ విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. అలాగే ఇన్‌చార్జి వీసీ బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకపోవటమే గాక విద్యార్థుల సమస్యలను పక్కదారి పట్టించే విధంగా ప్రభుత్వానికి తప్పుడు నివేదికలు ఇస్తున్నారని ఆయన ఆరోపించారు. బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థుల మీద దుష్ప్రచారం చేస్తూ కాలం వెళ్లదీస్తున్నారని తెలిపారు.

అత్యాచారం చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదివాసీ మహిళపై లైంగికదాడికి చేసిన వ్యక్తిని కఠినంగా ప్రగతిశీల మహిళా సంఘం పీఓడబ్ల్యూ ప్రధాన కార్యదర్శి మడావి రేణుక బాయి అన్నారు. శనివారం పట్టణంలోని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ కార్యాలయంలో నిర్వహించిన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అమాయక ఆదివాసీ మహిళకు మాయమాటలు చెప్పి ఆటోలో నిర్మానుష్య ప్రాంతంలో తీసుకొని వెళ్లి లైంగికదాడికి పాల్పడి హత్య చేసి చనిపోయిందనుకొని అక్కడి నుంచి వెళ్లిపోయిన షేక్ మగ్దూం అనే మైనారిటీ వ్యక్తిని చట్టపరంగా శిక్షించాలని, వెంటనే ఉరి తీయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. జైనూరులో ఇప్పటివరకు వందమంది ఆదివాసీ మహిళలను అత్యాచారాలు మానభంగాలు, బలవంతంగా పెండ్లిలు చేసుకున్న ఇంతవరకు ప్రభుత్వ అధికారులు ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం చాలా దుర్మార్గమైన చర్య అని దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. జైనూర్‌లో ఎవరైతే అక్రమాలకు లైంగికదాడులకు, హత్యలకు దాడులకు పాల్పడుతున్న మైనార్టీలను అక్కడ నుంచి పంపివేయాలన్నారు. పెసా 1/70, చట్టాలు పకడ్బందీగా అమలు చేయాలన్నారు. సమావేశంలో కుమ్ర వనిత బాయి, కొడప జంగుబాయి, ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు సాయికుమార్, ప్రధాన కార్యదర్శి కుంభ అశోక్ పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు గుర్తింపు



నవతెలంగాణ-తాంసి

జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం విద్యారంగంలో ఉత్తమ సేవలందించిన ఉద్యోగస్తును సన్మానించారు. అందులో భాగంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ గా విధులు నిర్వహిస్తూన్న సుదర్శన్‌ను ఉత్తమ ప్రిన్సిపల్‌గా అవార్డు ప్రధానం చేశారు. గ్రామీణ ప్రాంత కళాశాలలో అత్యధిక అడ్మిషన్లు మొత్తం కలిపి 750పైన విద్యార్థులను చేర్చుకొని ప్రయివేటు కళాశాలలకు దీటుగా తోటి సిబ్బంది విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తూ, ప్రతి సంవత్సరం మంచి ఫలితాలను సాధిస్తూ గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉత్తమ సేవలందిస్తున్న ప్రిన్సిపాల్‌తో పాటు సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ ప్రణీత, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

హిందీ దినోత్సవ పోస్టర్లను ఆవిష్కరించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సెప్టెంబర్ 20న జరిగే జిల్లాస్థాయి హిందీ దినోత్సవ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఎమ్మెల్యే పాయల శంకర్ ఆవిష్కరించారు. శనివారం పట్టణంలోని ఆయన నివాసంలో హిందీ భాష సేవాసమితి సభ్యులతో కలిసి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడు సుకుమార్ పెట్కులే మాట్లాడుతూ జాతీయ భాష హిందీ సేవలో జిల్లా ఎప్పటికీ ముందుంటుందని, దివంగత గుజరాతి శివరాం, ప్రకాష్ గౌడ్‌ల స్ఫూర్తితో జిల్లాలో హిందీ భాషాభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ఇటీవల పదోన్నతి పొందిన 85 మంది హిందీ పండితులతో పాటుగా హిందీ భాషకై విశేష సేవలందిస్తున్న 15 మంది విద్యావేత్తలను సన్మానించి, వారి ద్వారా మార్గదర్శనం విద్యార్థులకు అందించనున్నామని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస, చిత్రలేఖన పోటీలను ఏర్పాటు చేశామని విజేతలకు బహుమతులు ప్రధానం చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హిందీ భాష సేవా సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి ద్రోణాలే దత్తాత్రేయ, కోశాధికారి చంద్రశేఖర్ అంబేకర్, కార్యవర్గ సభ్యులు జావిద్ అలీ, భాస్కర్ ప్రధాన్, పవర్ ఉత్తం, శ్రీనివాస్ కాలే, జనార్ధన్ ఘులే, సీతారాం పాల్గొన్నారు.

నేటి ప్రజావాణి వాయిదా

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మహాత్మా జ్యోతిబా పూలే హైదరాబాద్ ప్రజాభవన్‌లో ప్రతి శుక్రవారం, మంగళవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం సెప్టెంబర్ 11కు వాయిదా వేసినట్టు ప్రజాపాలన ప్రత్యేకాధికారి డి.దివ్య తెలిపారని జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల అర్జీలను స్వీకరించేందుకు ప్రతి మంగళవారం, శుక్రవారం నిర్వహిస్తున్న ప్రజావాణి సందర్భంగా ఈ నెల 10న ప్రజాభవన్‌లో 16వ కేంద్ర ఆర్థిక సంఘంతో ముఖ్యమైన సమావేశం జరుగుతున్న నేపథ్యంలో ప్రజావాణిని బుధవారానికి మార్చినట్టు, ఈ విషయాన్నీ అర్జీదారులు గమనించాలని సూచించారు.

సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలి

నవతెలంగాణ-సిర్పూర్(టీ)



సీజనల్‌లో వచ్చే వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర విద్యాలయంలో కొన్ని రోజుల నుండి విద్యార్థులకు జ్వరాలు రావడంతో జిల్లా వైద్య అధికారి తుకారం భట్ పర్యవేక్షణలో లోనవెల్లి పీహెచ్‌సీ సిబ్బంది ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. ప్రతిరోజు జ్వరాలు సోకే విద్యార్థుల సంఖ్య పెరుగుతూ ఉండడంతో ప్రిన్సిపాల్ శ్రీనివాస్, కలెక్టర్ వెంకటేష్ ధోత్రేకు సమాచారం ఇవ్వగా, కలెక్టర్ సూచన మేరకు పరిశీలనకు వచ్చారు. జ్వరాలు వచ్చిన విద్యార్థుల సంఖ్యకు హాస్టల్లో స్థలం సరిపోకపోవడంతో సిర్పూర్ ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించి వైద్యం అందించాలని గురుకుల సిబ్బందికి సూచించారు. ఆమె వెంట తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ సత్యనారాయణ ఉన్నారు.

ప్రజల సౌకర్యార్థం 144 సెక్షన్ సడలింపు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని జైనూర్ మండల కేంద్రంలో జరిగిన ఘటన నేపథ్యంలో శాంతి భద్రతల పరిరక్షణకు విధించిన 144సీఆర్‌పీసీ సెక్షన్ అమలును ప్రజల సౌకర్యార్థం సడలింపు ఇవ్వడం జరిగిందని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినాయక చవితి, మిలాద్-ఉన్-నబి పండుగల నేపథ్యంలో నిత్యవసరాలకు ఉదయం 8 గంటల నుండి 11 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుండి 7 గంటల వరకు సడలింపు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఘటన నేపథ్యంలో నిలిపివేసిన ఇంటర్నెట్ సేవలను జైనూర్, కెరమెరి, సిర్పూర్ (యు), లింగాపూర్, వాంకిడి, తిర్యాణి మండలాలు మినహా జిల్లాలో అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రజలు ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకొని మత సామరస్యంతో శాంతి భద్రతల పరిరక్షణలో సహకరించాలని కోరారు. ప్రస్తుతం జైనూర్‌లో ప్రశాంత వాతావరణం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు.

సబ్ కలెక్టర్‌ను కలిసిన సీపీఐ(ఎం) నాయకులు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన శ్రద్ధా శుక్లాను ఆదివారం సీపీఐ (ఎం) నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆ పార్టీ సిర్పూరు నియోజకవర్గ కన్వీనర్ ముంజం ఆనంద్‌కుమార్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లాను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఆర్డీఓగా విధులు నిర్వర్తించిన సురేష్ ఇక్కడి నుండి రిలీవ్ కావడంతో ఆయనను కూడా శాలువాతో సత్కరించారు. నియోజకవర్గంలోని సమస్యలను సబ్‌కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించేలా చూడాలని కోరారు.

జూనియర్ ఫారెస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా యోగేష్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆసిఫాబాద్ డివిజన్ పరిధిలోని జూనియర్ ఫారెస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడుగా ఆసిఫాబాద్ డిప్యూటీ రేంజ్ అధికారి యోగేష్ కులకర్ణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలోని జిల్లా అటవీ శాఖ కార్యాలయ ఆవరణలోని మీటింగ్ హాల్‌లో మంచిర్యాల అసోసియేషన్ అధ్యక్షుడు అబ్దుల్ అజహర్, కాగజ్‌నగర్ అసోసియేషన్ అధ్యక్షుడు ముసవీర్‌లు ఎన్నికల అధికారులుగా వ్యవహరించగా కమిటీ ఎన్నిక జరిగింది. కమిటీలో మొత్తం ఆరు పోస్టులకు గాను నాలుగు ఏకగ్రీవం కాగా రెండింటికి ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడితో పాటు ఉపాధ్యక్షుడిగా అనిల్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా సాయిచరణ్, ఆర్గనైజేషన్ సెక్రటరీగా సద్దాం హుస్సేన్ ఏకగ్రీవం కాగా, జాయింట్ సెక్రెటరీ పోస్ట్‌కు ఇద్దరు, ట్రెజరీ పోస్టుకు ఇద్దరు పోటీ పడడంతో ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల్లో మొత్తం 74 మంది అటవీ అధికారులు పాల్గొనగా జాయింట్ సెక్రటరీగా పోటీలో నిలిచిన స్వప్న, ట్రెజరీ పోస్టుకు పోటీలో నిలిచిన బుఖ్య రవి గెలుపొందారు. రెండు సంవత్సరాలు కమిటీ కొనసాగనున్న నేపథ్యంలో సిబ్బంది సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని నూతన అధ్యక్షుడు యోగేష్ వెల్లడించారు. క్షేత్రస్థాయిలో అనేక సమస్యలతో అటవీ అధికారులు ఇబ్బందులు పడుతున్నారని, వీటిని ఉన్నతాధికారుల దృష్టికి ఎప్పటికప్పుడు తీసుకువెళ్లి పరిష్కరించేలా ప్రయత్నం చేస్తానని తెలిపారు. నూతన కమిటీకి పలువురు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని ఆరు రేంజ్‌ల అటవీ శాఖ డిప్యూటీ రేంజ్ అధికారులు, సెక్షన్ అధికారులు, బీట్ అధికారులు పాల్గొన్నారు.

డీఎస్పీగా సదయ్య బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-కాగజ్‌నగర్



కాగజ్‌నగర్ డీఎస్పీగా పి సదయ్య శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ విధులు నిర్వర్తించిన డీఎస్పీ కరుణాకర్ ఆసిఫాబాద్ డీఎస్పీగా బదిలీ కాగా, ఆసిఫాబాద్ డీఎస్పీ సదయ్యను ఇక్కడికి బదిలీ చేశారు. కాగా జైనూర్‌లో ఇటీవల జరిగిన అల్లర్లపై విచారణాధికారిగా కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్‌ను నియమించిన విషయం తెల్సిందే. దీనిలో భాగంగానే తాత్కాలికంగా ఆసిఫాబాద్ డీఎస్పీగా కరుణాకర్‌ను బదిలీ చేసి, అక్కడి డీఎస్పీ సదయ్యను ఇక్కడికి పంపించినట్లు తెలుస్తోంది.

రాష్ట్రస్థాయి ప్రజావాణి 11కి వాయిదా

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్రస్థాయిలో మహాత్మ జ్యోతిబాపూలే ప్రజా భవన్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం 10వ తేదీ నుండి 11వ తేదీకి వాయిదా వేసినట్లు కలెక్టర్ వెంకటేష్ ధోత్రే ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల అర్జీలను స్వీకరించేందుకు ప్రతి మంగళ, శుక్రవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో 10వ తేదీన ప్రజాభవన్‌లో 16వ ఆర్థిక సంఘంతో ముఖ్య సమావేశం ఉన్నందున ప్రజావాణి కార్యక్రమాన్ని 10వ తేదీ నుండి 11వ తేదీకి వాయిదా వేయడం జరిగిందని పేర్కొన్నారు. జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకానికి అర్హుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంగ్లీషులో రెండు, హిస్టరీ, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, కంప్యూటర్ సైన్స్, బోటనీ, జువాలజీ సబ్జెక్టులలో ఒక్కొక్కటి చొప్పున పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ఆమె వివరించారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 11 సాయంత్రం నాలుగు గంటలలోగా కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులలో పీజీలో 55 శాతం మార్కులు కలిగి ఉండాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 50 శాతం మార్కులు కలిగి ఉండాలని పేర్కొన్నారు. పీహెచ్‌డీ, నెట్, సెట్ ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మూఢ నమ్మకాల నిరోధక చట్టం తేవాలి

• జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి నూతుల రవీందర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మూఢనమ్మకాల నిరోధానికి ప్రత్యేక చట్టాలు తీసుకురావాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి నూతుల రవీందర్ అన్నారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జనకాపూర్‌లో నిర్వహించిన జనవిజ్ఞాన వేదిక జిల్లా మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఇంకా మన దేశంలో ముఖ్యంగా మన రాష్ట్రంలో అక్కడక్కడ మూఢనమ్మకాల సంఘటనలతో కొంతమంది ప్రజలు బలవుతున్నారన్నారు. ఇటువంటి ప్రమాదాలను నివారించడానికి మూఢనమ్మకాలను తొలగించడానికి ప్రత్యేక నిరోధక చట్టాలు తీసుకురావాల్సిన అవసరముందన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 51ఏహెచ్‌లో పొందుపరిచిన అంశాలను సొసైటీలో ప్రమోట్ చేయడం కోసం జన విజ్ఞాన వేదిక ఏర్పడిందని దీనిలో ప్రతి ఉద్యోగి, ఉపాధ్యాయులు భాగస్వాములు కావాలన్నారు. ఆసిఫాబాద్ జిల్లాలో జనవిజ్ఞాన వేదిక కృషి చాలా అవసరమని, జిల్లాలో ఆదివాసులు ఎక్కువగా ఉన్నారని వీరు చదువుకు, సైన్స్ పరిజ్ఞానానికి దూరంగా ఉండటం వల్ల వీరు సైన్స్ ఫలితాలను పొందలేకపోతున్నారన్నారు. ప్రజలకు జనవిజ్ఞాన వేదిక కృషి వల్ల సైన్స్ ఫలితాలు ప్రతి ఒక్కరికి అందాల్సిన అవసరం ఉందని తెలిపారు. దీనికోసం నూతన కమిటీ కృషి చేయాలన్నారు. అనంతరం రెండు సంవత్సరాల కాలానికి నూతన కమిటీ ఎన్నుకున్నారు.

జన విజ్ఞాన వేదిక నూతన కమిటీ ఎన్నిక..

2024-2026కు నూతన కమిటీని ఎన్నుకోగా జిల్లా గౌరవ అధ్యక్షులుగా కటుకం మధుకర్, అధ్యక్షులుగా మహాకళ రాజ కమలాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వడ్లూరి రాజేష్, కోశాధికారిగా గంగారాం, ఉపాధ్యక్షులుగా జాడి ప్రవీణ్, వైరాగడే లక్ష్మణ్, దూస నారాయణ, సూత్రాల వేణు, కార్యదర్శులుగా జాదవ్ గోవిందరావు, కృష్ణ చారి, బసర్కర్ ప్రకాష్, రాపెల్లి సఫల్, విద్యా కమిటీ కన్వీనర్‌గా తిరుపతయ్య, చెకుముకి కన్వీనర్‌గా తౌటం శ్యాంసుందర్, శాస్త్ర ప్రచార కన్వీనర్‌గా లకావత్ శంకర్, సాంస్కృతిక కన్వీనర్‌గా దామోదర్, సోషల్ మీడియా కన్వీనర్‌గా చాపిలె సాయికృష్ణ, పర్యావరణ కన్వీనర్‌గా కోట శ్రీనివాస్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

గణేష్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

• కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రజలు పండుగలను మత సామరస్యంతో ప్రశాంత వాతావరణంలో సంతోషంగా జరుపుకోవాలని, వినాయక నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అధికారులకు సూచించారు. ఆదివారం ఆసిఫాబాద్ మండలంలో గల గొడెల్లివాగు వద్ద చేసిన గణేష్ నిమజ్జనం ఏర్పాట్లను మున్సిపల్ కమిషనర్ భుజంగరావు, విద్యుత్ శాఖ ఎఈ సదాశివ్, ఎస్సై రాజేశ్వర్‌లతో కలిసి పరిశీలించారు. వినాయక చవితి, మిలాద్-ఉన్-నబి పండుగలను ప్రజలు సామరస్యంతో సంతోషంగా జరుపుకోవాలన్నారు. వినాయక నవరాత్రులు ముగిసిన తరువాత నిమజ్జనం రోజున ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. నిమజ్జనం ప్రాంతానికి వచ్చే వాహనాలు సక్రమంగా వచ్చేందుకు





చెట్ల పొదలు తొలగించి రోడ్లపై గుంతలకు మరమ్మత్తులు చేయాలని, నిమజ్జన ప్రాంతంలో క్రేన్ అందుబాటులో ఉంచాలని, అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని తెలిపారు. వినాయక మండపాల వద్ద నిబంధనలను కచ్చితంగా పాటించాలని, సంబంధిత శాఖల సమన్వయంతో తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పారిశుధ్యం, విద్యుత్, మున్సిపల్, మండల ప్రజా పరిషత్ సంబంధిత శాఖల సమన్వయంతో అవసరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

వినాయకుని దర్శించుకున్న కలెక్టర్

జిల్లా కేంద్రంలోని బజారువాడలో ఏర్పాటు చేసిన సంఘ సేవ యువజన సంఘం వినాయకుని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా నిర్వహణ కమిటీ సభ్యులు కలెక్టర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో నిర్వహణ కమిటీ సభ్యులు సాయికృష్ణ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కొలువుదీరిన వినాయకులు

• మట్టి వినాయకుల పంపిణీ



ఆసిఫాబాద్ : బాపునగర్‌లో గణనాథుడికి పూజలు చేస్తున్న భక్తులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

వినాయక చవితిని పురస్కరించుకుని ఊరువాడ ప్రత్యేక మండపాలు ఏర్పాటు చేసి వినాయకులను ప్రజలు కొలువు తీర్చారు. జిల్లా కేంద్రంలో 42 వినాయకుని దీరగా మండల పరిధిలో 112 వినాయక మండపాలు ఏర్పాటు చేశారు. ప్రముఖులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వినాయక చవితిని పురస్కరించుకొని మట్టి వినాయకులపై అవగాహన పెంచే కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలో పలు సంఘాల ఆధ్వర్యంలో ప్రజలకు మట్టి వినాయకులు పంపిణీ చేశారు.

పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో..

జిల్లా కేంద్రంలోని వివేకానంద చౌక్ వద్ద పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మట్టి వినాయకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మట్టి వినాయకులు ప్రతిష్ఠించాలని అప్పుడే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఇరుకుల్ల ఆంజనేయులు, నాయకులు శ్రీకాంత్, లింగయ్య, సునీత, మంగ, వేణుగోపాల్, శ్రీనివాస్, శ్రీకాంత్, మోహన్, సంజీవ్, తిరుపతి, ధర్మయ్య పాల్గొన్నారు.

మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో..

జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద మట్టి వినాయకుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్నర్ రమేశ్ మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ తయారు చేసిన వినాయక వాడకుండా మట్టి వినాయకులు వాడాలన్నారు. ప్రజల్లో అవగాహన పెంచే ఉద్దేశంతో మట్టి వినాయకులు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం నాయకులు గడ్డల సురేష్, మిట్ట వెంకన్న, సుంకరి పెంటయ్య, రుకుమ్ ప్రహ్లాద్, అనిశెట్టి సదాశివ్, మణికొండ వెంకన్న, గణపతి శంకర్, తిరుపతి, వెంకన్న పాల్గొన్నారు.

దహెగాం : మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో వాడవాడలా గణనాథులు శనివారం మండపాలలో కొలువుదీరారు. ఉదయం నుండి ఇండ్లలో మట్టి వినాయకుల ప్రతిమలను ప్రతిష్ఠించి పూజలు చేసినంతరం మధ్యాహ్నం సమయంలో వాడవాడలా గణనాథులను ఊరేగింపుతో భజభజంత్రీల మధ్య టపాసులు పేల్చుతూ గ్రామా వినాయక విగ్రహాలను ఆహ్వానించారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య గణనాథులను మండపాలలో ప్రతిష్ఠించి మొదటి రోజు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయా మండపాల వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

వాంకిడి : మండలంలోని ఆయా గ్రామాలతో పాటు మండల కేంద్రంలో గణనాథులు కొలువుదీరారు. గణేష్ మండపాలను విద్యుత్ దీపాలతో అలంకరించి పూజలు చేశారు. ఆయా మండపాల వద్ద గణేష్ మండపాల నిర్వాహకులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చూడాల్సిన బాధ్యత వారిపై ఉందన్నారు. ఎలాంటి ఇబ్బందులు వచ్చిన పోలీసులకు తక్షణమే సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచించారు.

పెంచికల్‌పేట్ : వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని గ్రామాల్లో గణనాథులను శనివారం ప్రతిష్ఠించారు. గ్రామంలో భక్తులు విగ్రహాలను డప్పుచప్పుళ్ల, డీజే సౌండ్స్ మధ్య మహిళల మంగళ హారతుల నడుమ ప్రతిష్ఠించారు. ఏకదంతుడికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ వేడుకల్లో ఎలాంటి గొడవలు జరుగకుండా ఉండేందుకు నిర్వాహకులకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచించారు. ఆయా మండపాల వద్ద నిర్వాహకులు విద్యుత్ దీపాలను అలంకరించారు.



ఆసిఫాబాద్ : మట్టి గణపతులను పంపిణీ చేస్తున్న పద్మశాలి సంఘం నాయకులు



పెంచికల్‌పేట్: వినాయకుడిని తీసుకున్న చిన్నారులు

హ్యాండ్ బాల్ సబ్ జూనియర్ జట్ల ఎంపిక



నవతెలంగాణ-ఆసిఫాబాద్

హ్యాండ్ బాల్ ఉమ్మడి జిల్లా సబ్ జూనియర్ జట్ల ఎంపిక జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. క్రీడ పోటీలకు ముఖ్య అతిథిగా హాజరైన హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆదిలాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి కనపర్తి రమేష్ మాట్లాడుతూ క్రీడలలో గెలుపోటములు సహజమని అయితే వాటి వల్ల ఎటువంటి సమస్యలైన జీవితంలో ఎదుర్కొనే మనోధైర్యం కలుగుతుందన్నారు. ఎంపిక పోటీల కార్యక్రమాల్లో నాలుగు జిల్లాల నుంచి 150 మంది బాలబాలికలు పాల్గొన్నారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా హ్యాండ్ బాల్ కోచ్ శునర్కర్ అరవింద్, విశాల, ఆడే రమేష్, కడతల రాకేష్, జి.సాయిలు వ్యవహరించారు. కోచ్ సునార్కర్ అరవింద్ మాట్లాడుతూ ఎంపిక చేయబడ్డ సబ్ జూనియర్ బాలుర జట్టుకు 9వ తేదీ నుంచి 13వ తేదీ వరకు రెసిడెన్షియల్ స్కూల్ ఆసిఫాబాద్‌లో రెసిడెన్షియల్ కోచింగ్ క్యాంప్ నిర్వహించబడుతుందని ఈనెల 14 నుంచి 16 వరకు హనుమకొండలోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో జరుగనున్న రాష్ట్ర స్థాయి పోటీలలో ఈ జట్టు పాల్గొంటుందని తెలిపారు. కార్యక్రమంలో పీడీలు వివేక్, ఆదిలాబాద్ పీఈటీలు చిన్నక్క, ఫుట్‌బాల్ కోచ్ రవి, ఖోఖో కోచ్ తిరుమల్ పాల్గొన్నారు.

లొద్దిగూడలో వైద్యశిబిరం

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని లొద్దిగూడ గ్రామంలో ఆదివారం ఆరోగ్య విస్తరణ అధికారి రవిదాస్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. 58 మందికి రక్త పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. గ్రామంలో పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఆరోగ్య విస్తరణ అధికారి రవిదాస్ సూచించారు. ఎలాంటి ఇబ్బందులు వచ్చిన తక్షణమే ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకోవాలని గ్రామస్తులను కోరారు. ఆయనతో పాటు ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వైద్యసిబ్బంది, గ్రామస్తులున్నారు.

బౌద్ధంతోనే శాంతి సమానత్వం



నవతెలంగాణ-కాగజ్‌నగర్

బౌద్ధంతోనే శాంతి, సమానత్వం ఉంటాయని మహారాష్ట్ర బౌద్ధ ప్రచారకులు, శిక్షకులు అన్నారు. ఆదివారం కాగజ్‌నగర్ పట్టణంలో భారతీయ బౌద్ధ మహాసభ, కాగజ్‌నగర్ మండల శాఖ ఆధ్వర్యంలో వర్షవాస్ పూజ, ప్రవచన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక మీరాతాయి దక్షభూమిలో నిర్వహించిన ఈ పూజా కార్యక్రమంలో ప్రచారకులు మాట్లాడుతూ దేశంలో శాంతి, సౌభ్రాతృత్వం, సమానత్వం సిద్ధించాలంటే బౌద్ధం అనుసరించాలని సూచించారు. సమసమాజ స్థాపనకు బహుజనులు ఏకం కావాలని అన్నారు. ఈ సందర్భంగా చంద్రపూర్ నుండి వచ్చిన మహిళా కార్యకర్తలు రమాబాయి జీవిత చరిత్ర, నాటక ప్రదర్శన పలువురిని కంటతడి పెట్టించింది. ఈ కార్యక్రమంలో భారతీయ బౌద్ధ మహాసభ, సమతా సొసైటీ, సమతా సైనిక్‌దళ్, రమాబాయి మహిళా మండలి, అంబేద్కర్ మెమోరియల్ సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన మాజీ మున్సిపల్ ఛైర్మన్



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ మున్సిపల్ ఛైర్మన్ సద్దాం హుస్సేన్ శనివారం హైద్రాబాద్‌లో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్సీ దండె విఠల్ ఆధ్వర్యంలో టీపీసీసీ అధ్యక్షుడు ముఖేష్‌గౌడ్ సమక్షంలో ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరగా ముఖేష్‌గౌడ్ ఆయనకు కాంగ్రెస్ కండువా కప్పారు. గతంలో బీఆర్‌ఎస్‌లో ఉన్న సద్దాం హుస్సేన్ ఆ పార్టీ నుండి మున్సిపల్ ఛైర్మన్‌గా కొనసాగారు. ప్రస్తుతం మాజీ మున్సిపల్ ఛైర్మన్ అయిన సద్దాం హుస్సేన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. ఎమ్మెల్సీ దండె విఠల్ నాయకత్వంలో స్థానిక సంస్థల్లో గెలుపే లక్ష్యంగా పని చేస్తానని ఈ సందర్భంగా ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

నవతెలంగాణ-బోథ్



మండలంలోని పాట్నాపూర్ గ్రామానికి చెందిన తోడసం భూమన్నకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడంతో గ్రామస్తుల ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మానం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ అప్క కిషన్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో నిబద్ధతగా పనిచేస్తూ విద్యార్థులు, తోటి ఉపాధ్యాయులు, అధికారులు, గ్రామస్తుల మన్ననలు పొందుతూ వృత్తికి వన్నె తీసుకొచ్చారని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్లు పంద్రం సుగుణ, తోడసం గోపాల్, ఉపాధ్యాయులు పెందూర్ సోనేరావు, మడావి లాల్ దేవ్, తోడసం గంగారాం పాల్గొన్నారు.

గౌడ సంఘం ఆధ్వర్యంలో సంబరాలు

నవతెలంగాణ-జన్నారం



తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ను కాంగ్రెస్ నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ గౌడ సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహం వద్ద ఒకరికొకరు స్వీట్లు పంచుకొని సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల గౌడ సంఘం అధ్యక్షుడు మూల భాస్కర్ గౌడ్, సంఘం నాయకులు కాసారపు పోచాగౌడ్, పరకాల తిరుపతిగౌడ్, రాసమల్ల శంకర్ గౌడ్, పాపాగౌడ్, ప్రభాకర్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, పొదేటి మల్లేష్ గౌడ్, పోతు గంటి ఎల్లా గౌడ్, రాజాగౌడ్, కాంగ్రెస్ నాయకులు మామిడిపెల్లి ఇందయ్యా, దుమ్మల రమేశ్, ముత్యం సతీష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసుల వితరణ

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని కిష్టాపూర్ జడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న నరహరి శర్మ అనే ఉపాధ్యాయుడు ఆ పాఠశాలలో చదువుతున్న ఆరవ తరగతి 85 మంది విద్యార్థులకు స్టీల్ ప్లేట్లను, గ్లాసులను బహుకరించారు. అలాగే ఉపాధ్యాయులు మంచినీటి కోసం స్టీల్ వాటర్ డ్రమ్మును అందించారు. విద్యార్థుల పట్ల ఇంతటి ప్రేమ, ఇంతటి గొప్ప మనసున్న నరహరి శర్మకి పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుండ రాజన్న, పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు దాముక కమలాకర్, ఉపాధ్యాయుల బృందం విద్యార్థుల పక్షాన ధన్యవాదాలు తెలిపారు.

కొలువు దీరిన గణ నాథులు



నవతెలంగాణ-మంచిర్యాల

జిల్లాలో వినాయక చవితి వేడుకలు అంబరాన్ని అంటాయి. వాడ వాడ ల కొలువు దీరిన గణ నాథులు భక్తులతో ప్రత్యేక పూజలు అందుకున్నారు. గణపతిని ప్రత్యేకంగా అలంకరించిన మండపాల్లో ప్రతిష్ఠించి ఉత్సహంగా వేడుకలు జరుపుతున్నారు. శనివారం వినాయక చవితి సందర్భంగా ఊరురా గణనాథులు కొలువు దీరి తొలి పూజలు అందుకున్నారు. కొలువు దీరిన వినాయకులకు అర్చకులు మంత్రోచ్చరనలతో ప్రత్యేక పూజలు చేశారు. ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. మరో వైపు ఇండ్ల లోను ప్రజలు గణపతి విగ్రహాలకు కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో ప్రజా ప్రతినిధులు, అధికారులు, రాజకీయ పార్టీల నాయకులు గణపతి పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పర్యావరణ హితం కోసం మట్టి గణపతులను ఉపయోగించాలని ఇటు అధికారులు, స్వచ్ఛంధ సంస్థల నిర్వాహకులు మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు.

దండేపల్లి : దండేపల్లి మండలం కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో శనివారం ఘననాథులు కొలువుదీరారు. భక్తులు ఊరేగింపుగా తీసుకువచ్చి మండపాల్లో ప్రతీష్ఠించారు. ఏటా భాద్రపద మాసంలో శుక్లపక్షమి చవితి రోజున వచ్చే ఈ పండగను తెలుగు ప్రజలు ఘనంగా నిర్వహించుకుంటారు. గణపతి నవరాత్రులు, రంగురంగుల మండపాలు ఈ పండగకు అదనపు ఆకర్షణ నిలుస్తాయి. ముస్తాబు చేసిన మండపాలు అందరినీ ఆకట్టుకున్నాయి. దీంతో మండలంలో ఎక్కడ చూసిన వినాయక చవితి పండగ సందడి నెలకొంది.

జన్నారం : మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాలలో వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో, కాలనీలలో విభిన్న రూపాలలో వినాయకుడి విగ్రహాలు మండపాల్లో కొలువుదీరాయి. సుందరంగా ముస్తాబు చేసిన మండపాల్లో విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్యంగా మండల ఆర్యవైశ్య సంఘం, వర్తక సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మండపం, వినాయకుడు పలువురిని ఆకట్టుకున్నాయి.

రివాల్వర్‌తో బెదిరింపులకు పాల్పడ్డ వారి అరెస్టు

- వివరాలు వెల్లడించిన మంచిర్యాల డీసీపీ ఏ భాస్కర్



నవతెలంగాణ-మంచిర్యాల

రివాల్వర్‌తో బెదిరింపు, దొంగతనాలకు పాల్పడిన ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు మంచిర్యాల డీసీపీ ఏ.భాస్కర్ తెలిపారు. శనివారం స్థానిక డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితులను ప్రవేశపెట్టి డీసీపీ వివరాలు వెల్లడించారు. నెన్నెల మండలానికి చెందిన అన్వేష్ మంచిర్యాలలోని ఏసీసీలో నెన్నెల మండలం ఆవడం గ్రామానికి చెందిన జితేందర్ తన భార్య స్వాతిని చూసేందుకు ఏసీసీకి వచ్చాడు. అక్కడ ఆవడం గ్రామానికి చెందిన రాంటెంకి అన్వేష్ కనిపించడంతో తనకు ఇక్కడ ఏంపని అడగగా అన్వేష్ వద్ద ఉన్న రివాల్వర్ చూపి చంపుతానని బెదిరింపుకు పాల్పడ్డాడు. భయంతో కేకలు వేస్తు పారిపోయిన బాదితుడు శుక్రవారం మంచిర్యాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు సీఐ బన్సీలాల్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టి నింధితున్ని, ఆయనకు సహకరించిన ఇద్దరిని అరెస్టు చేశారు. మంచిర్యాల రైల్వే స్టేషన్‌లో అన్వేష్‌తో పాటు నెన్నెల మండలం ఆవడం గ్రామానికి చెందిన దుర్గం భాను ప్రసాద్, నస్పూర్‌లోని శ్యాంనగర్‌కు చెందిన మంతెన అశోక్‌లను అరెస్టు చేశారు. వీరిని విచారించగా అన్వేష్, భానుప్రసాద్‌లు వరుసకు అన్నదమ్ములు కాగా అశోక్ వీరి స్నేహితుడని, వీరితో పాటు నెన్నెల మండలానికి చెందిన కామెర మధు, దుగుట దిలీప్‌లు కలిసి కొన్ని సంవత్సరాలుగా నెన్నెల మండలంలో అమాయక ప్రజలను బెదిరింపులకు పాల్పడుతున్నారు. బంగారం పూతతో ఉన్న రాగి బిళ్లలను బంగారు నాణలుగా అమ్ముతున్నట్లు తెలిసింది అన్నారు. న్యూడెమోక్రసీ పార్టీ విద్యార్థి అనుబంధ సంస్థ పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడిగా, న్యూడెమోక్రసీ సింగరేణి అనుబంధ సంస్థ ఇఫ్టులో పని చేసిన చెన్నూర్ మండలం సోమనపల్లి గ్రామానికి చెందిన తోకల తిరుపతికి చెందిన రివాల్వర్‌ను తన బావమరిది అయిన అశోక్ ఇంటి వద్ద దాచేవాడని, ఇటీవల తిరుపతి మృతి చెందడంతో అశోక్ రివాల్వర్ నీ ఉపయోగించి అన్వేష్, భానుప్రసాద్‌లతో కలిసి బెదిరింపులకు పాల్పడుతూ డబ్బులు సొమ్ముచేసుకునేవారన్నారు. అశోక్ గత వారం ఈ రివాల్వర్‌ను జితేందర్‌ను చంపేందుకు అన్వేష్‌కు అందజేశాడు. ఈ రివాల్వర్‌తో పాటు అన్వేష్ మహారాష్ట్ర నాందెడ్ నుంచి ఒక ఎయిర్ పిస్టోలు, ఒక కత్తిని కొనుక్కువచ్చి పిస్టోలును భానుప్రసాద్ వద్ద, కత్తిని తన వద్ద ఉంచుకున్నాడు. వీటి సహాయంతో పలుమార్లు మండలంలోని ప్రజలను బెదిరించినట్లు విచారణలో తేలిందన్నారు. ముగ్గురు హైదరాబాద్ పారిపోతుండగా మంచిర్యాల రైల్వే స్టేషన్‌లో పట్టుకొని వారి వద్ద నుంచి రివాల్వర్, ఎయిర్ పిస్టోల్, రెండు కత్తులను, మూడు బుల్లెట్లను సీజ్ చేసి వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సమావేశంలో మంచిర్యాల ఏసీపీ ప్రకాష్, సీఐ బన్సిలాల్, ఎస్ఐ సనత్ పాల్గొన్నారు.

రైతులు అధైర్య పడవద్దు నష్టపరిహారం అందిస్తాం



నవతెలంగాణ-వేమనపల్లి

రైతులు అధైర్యపడవద్దు ముంపుకు గురైన పంటలకు నష్ట పరిహారం అందిస్తాం అని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. ఆదివారం మండలంలో పర్యటించిన ఆయన ఇటీవల కురిసిన వర్షాలకు ప్రాణహిత నది వరద వల్ల ముంపుకు గురైన పత్తి పంటలను పరిశీలించారు. జరిగిన పంట నష్టం వివరాలు రైతులని అడిగి తెలుసుకున్నారు. రైతులు ఎవరు అధైర్యపడవద్దని నష్టపోయిన పంటలకు ప్రభుత్వం ద్వారా పరిహారం అందించి ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఇటీవల సుంపుటం గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు కుబిడే కిష్టయ్య తల్లి అనారోగ్యంతో మరణించగా ఈ విషయం తెలుసుకొని వారి నివాసానికి వెళ్లి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యులు సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండి వైద్యం అందించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ రాజేష్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్టాఫ్ నర్సులను నియమించాలని ఎమ్మెల్యేని కోరారు. ఆ తర్వాత నీల్వాయిలో ఏర్పాటు చేసిన కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీలో పాల్గొని 18 మంది లబ్దిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేద బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి పనిచేస్తుందని అన్నారు. ముల్కలపేట, రాచర్ల శివారులో గల బ్రిడ్జిలను పరిశీలించి తొందరగా బ్రిడ్జి పనులు పూర్తి చేయాలని రాకపోకలు అంతరాయం కలగకుండా చూడాలని రోడ్డు భవనాల శాఖ అధికారులను ఆదేశించారు. ముల్కలపేట గ్రామంలో రైతులు తమకు రూ.రెండు లక్షల పైన ఉన్నవాళ్లకు మాఫీ కాలేదని రైతులు కోరగా ఎంత మందికి అయితే మాఫీ కాలేదో అందరూ వ్యవసాయ శాఖ నుంచి లిస్ట్ తీసుకు వస్తే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. అనంతరం వర్షానికి కొట్టుకు పోయిన మామడ గ్రామానికి సంబంధించిన వంతెన పరిశీలించి, తాత్కాలిక వంతెన నిర్మించాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట ఆర్డీఓ పి హరికృష్ణ, బెల్లంపల్లి ఏసీసీ రవికుమార్, మాజీ జడ్పీటీసీ ఆర్ సంతోష్ కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సయ్యద్ శాబీర్ అలీ, నీల్వాయి మాజీ సర్పంచ్ గాలి మధు, నాయకులు ఒడిల రాజన్న, తోకల రామచంద్రం, జాహెద్ అలీ, మోర్ల రమేష్ పాల్గొన్నారు.

గిరిజనులకు కాంగ్రెస్ అండగా నిలుస్తుంది

- మొదటి ఇందిరమ్మ ఇల్లు గిరిజనులకే
- కోలంగూడలో పాఠశాల భవనానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-హాజీపూర్

ఆదిమ గిరిజనులైనా కొలాంలు నివసించే కొలంగూడకు అండగా ఉంటామని ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు అన్నారు. ఆదివారం మండలంలోని పెద్దంపేట గ్రామ పంచాయతీ పరిధిలోని కొలంగూడలో రూ.38.15 లక్షల నిధులతో నిర్మించే పాఠశాల భవనానికి ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా పలువురు కొలంగూడ వాసులు తాము అడవికి వెళ్లి వెదురు బొంగు తెచ్చుకునేందుకు అటవీ అధికారులు అడ్డుకుంటున్నారని ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి అనుమతులు ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. కొలాంలు సొసైటీని ఏర్పాటు చేసుకుంటే ప్రభుత్వం నుంచి రుణాలను మంజూరు చేయిస్తానని చెప్పారు. పలువురు రైతులు పొలాలలకు వెళ్లే దారి వర్షానికి బురదమయం అవుతుందని బీటీ రోడ్డు వేయించాలని ఎమ్మెల్యేను కోరగా వెంటనే వేయిస్తానని రైతులకు హామీ ఇచ్చారు. పలువురు రైతులు తమకు రుణమాఫీ కాలేదని ఎమ్మెల్యేను అడగగా వెంటనే మండల వ్యవసాయ అధికారితో ఫోన్‌లో మాట్లాడి సమస్యను చూడాల్సిందిగా ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద విద్యార్థులకు మెరుగైన వసతులతో ప్రయివేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇండ్లను మొదటిగా కొలంగూడకే మంజూరు చేయించి, గృహాలకు సోలార్ విద్యుత్‌ను ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. ప్రతి ఇంటికి తాగు నీరు అందించి, వారి జీవన ప్రమాణాలు పెంచేందుకు కృషిచేస్తానన్నారు. వచ్చే వర్షాకాలంలోపు గిరిజన గ్రామానికి అన్ని సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. గ్రామంలో 700 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా ఫారెస్ట్ అధికారులు ట్రెంచ్ కొట్టారని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోగా సర్వే చేయించి ప్రభుత్వ భూమి అని తేలితే పేదలకు, నిర్వాసితులకు పంపిణీ చేసే కార్యక్రమం చేపడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీజీఈడబ్ల్యూఐడీసీ డీఈ శ్రీనివాస్, ఏఈ రాజేశం, ఎంఈఓ పోచన్న, కర్ణమామిడీ పీఏసీఎస్ చైర్మన్ కోట సత్తయ్య, మంచిర్యాల పీఏసీఎస్ వైస్ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, పెద్దంపేట మాజీ సర్పంచ్ పొట్టాల సుమలత, శ్రీశైలం గౌడ్, మాజీ ఎంపీటీసీ బాలరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, మండల అధ్యక్షుడు తోట రవి, సంజీవ రావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు నారిశెట్టి సంతోష్, సత్యగౌడ్, చింతపండు శ్రీనివాస్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మండల అధ్యక్షుడి ఇంటి ముట్టడి

- బీఆర్ఎస్ నాయకుల చేరికలపై నిలదీత



నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్ ఇంటిని కాంగ్రెస్ కార్యకర్తలు ముట్టడించారు. బీఆర్ఎస్ నాయకుల అక్రమ చేరికలపై నిలదీశారు. కాంగ్రెస్ నాయకుల అభిప్రాయం తెలుసుకోకుండా ఇప్పుడు బీఆర్ఎస్ నాయకులను చేర్చుకోవడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. మండలంలో కాంగ్రెస్ బలంగా ఉందని ఎన్నికల సమయంలో పార్టీని విమర్శించిన వారిని చేర్చుకోవడం ఏంటని మండిపడ్డారు. గత పదేళ్లు అధికారంలో ఉండి అక్రమాలు చేసి వాటిని కప్పిపుచ్చుకోవాడానికి అధికార పార్టీలో చేరుతున్నారని అన్నారు. అటువంటి వారికి ఆహ్వానించడం పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీయడమే అవుతుందని అన్నారు. గతంలో గడ్డం కుటుంబానికి ఓట్లు వేయొద్దు అని ప్రచారం చేసి ఎన్నికల తర్వత అదే గడ్డం కుటుంబంతో ఇప్పుడు చేరడం శోచనీయంమని మండి పడ్డారు. అక్రమంగా బీఆర్ఎస్ పార్టీ నాయకులను చేర్చుకోవడంతో మండలలో ఉన్న నాయకులు, కార్యకర్తలు తీవ్ర ఆందోళనలో ఉన్నారని, అసెంబ్లీ ఎన్నికల్లో, పార్లమెంట్ ఎన్నికల్లో ఈ మండలంలో అధిక మెజార్టీతో కాంగ్రెస్‌ను గెలిపించామని, ఇప్పుడు వారి అవసరం లేదని, ఏదేమైనా మండల అధ్యక్షుడు ఈ విషయంపై అధిష్టానంతో మాట్లాడి కార్యకర్తలకు, నాయకులకు న్యాయం చేయాలని మండల నాయకులు, కార్యకర్తలు కోరారు. ఈ సంధర్భంగా మండల అధ్యక్షడు రత్నం ప్రదీప్ మాట్లాడుతూ ఎమ్మెల్యే ఏ పరిస్థితుల్లో వారిని చేర్చుకోవడం జరిగిందోనని, కార్యకర్తలు, నాయకులు అభిప్రాయం పార్టీ అధిష్టానం దృష్టికి, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తా అని కార్యకర్తల అభిప్రాయం ప్రకారం నడుచుకుంటానని నచ్చ చెప్పాడు.

ప్రయివేట్ ఉపాధ్యాయుల ఇన్సూరెన్స్‌కు కృషి

- ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

నవతెలంగాణ-మంచిర్యాల

ప్రయివేటు పాఠశాలల ఉపాధ్యాయులకు జీవిత బీమా చేయడానికి కృషి చే స్తానని ప్రయివేట్ పాఠశాలల యజమాన్యం, ప్రభుత్వం సంయుక్తంగా ఇన్సూరెన్స్ డబ్బులు చెల్లించే విధంగా తగిన ఏర్పాట్లు చేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రయివేట్ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన ట్రస్మా జిల్లా శాఖ సమావేశానికి కరీంనగర్ జిల్లా న్యాయమూర్తి ప్రీతితో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాలోని అన్ని బడ్జెట్ ప్రయివేట్ పాఠశాలలకు చెందిన ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. దేశంలో విద్యావంతులను తయారుచేసిన గొప్ప పాత్ర ఉపాధ్యాయులదని కొనియాడారు. ప్రయివేట్ పాఠశాలల్లో లక్షల మంది విద్యార్థులకు విద్యాబోధన చేస్తూ లక్షల మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటి గొప్ప వృత్తిలో ఉన్న ఉపాధ్యాయ లోకానికి తన వంతుగా సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నానని పేర్కొన్నారు. ప్రయివేట్ బడ్జెట్ పాఠశాలల బలో పేతానికి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ట్రస్మా చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు వచ్చే ఏడాది ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులతో పాటు ప్రయివేట్ పాఠశాలల ఉపాధ్యాయులకు కూడా తగిన ప్రాధాన్యతను ఇచ్చి గురుపూజోత్సవం జరిపేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమం లో ట్రస్మా రాష్ట్ర ముఖ్య సలహాదారులు యాదగిరి శేఖర్ రావు, జిల్లా అధ్యక్షుడు దామెర్ల సిద్దయ్య, ప్రధాన కార్యదర్శి ఏనుగు శ్రీకాంత్ రెడ్డి, కోశాధికారి చంద్రమోహన్ గౌడ్, మాజీ అధ్యక్షుడు విష్ణువర్ధన్ రావు, టౌన్ ప్రెసిడెంట్ దుర్గాప్రసాద్, రాష్ట్ర జిల్లా నాయకులు పద్మా చరణ్ , బాలాజీ, విక్రమ్ రావు, భాగ్యలక్ష్మి, మధుసూధన్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్నా మోడీ

- ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి
- ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు



నవతెలంగాణ-మంచిర్యాల

కేంద్ర ప్రభుత్వం కార్మిక కర్షక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న నరేంద్ర మోడీ కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్నారని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ బాలరాజు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఏఐటీయూసీ జిల్లా కౌన్సిల్ సమావేశం మిట్టపల్లి పౌలు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ బాలరాజు మాట్లాడుతూ పది సంవత్సరాల కాలంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలంగా పనిచేస్తుందని, కార్మికులు ఎన్నో పోరాటాలు త్యాగాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కార్పొరేట్లకు పెట్టుబడుదారులకు బడ వ్యాపారస్తులకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడులను తయారు చేసిందని అన్నారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే దేశ అత్యున్నత న్యాయస్థానం తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని అన్నారు. సింగరేణిలో లాభాలను వెంటనే ప్రకటించి 35 శాతం ఇవ్వాలని అలాగే కాంట్రాక్టు కార్మికులకు జీఓ 22 ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో ఖాళీగా ఉన్న క్వాటర్లను కాంట్రాక్టు కార్మికులకు ఇవ్వాలని అన్నారు. కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని ఆర్టీసీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న రెండు పీఆర్సీలను వెంటనే ఇవ్వాలని అన్నారు. ఆర్టీసీలో కూడా యూనియన్లను పునరుద్ధరించి ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. సివిల్ సప్లై హమాలీ కార్మికుల లోడింగ్, అన్‌లోడింగ్ రేట్లు రూ.35 పెంచాలని హమాలీ కార్మికులను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. స్కీమ్ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని స్కీం వర్కర్లందరికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని అన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేసే కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని అన్నారు. ఎన్‌హెచ్ఎం ఉద్యోగులని 510 జీఓలోకి తీసుకొని రావాలని, ఎన్‌హెచ్ఎం ఉద్యోగులను ఎలాంటి షరతులు లేకుండా రెగ్యులర్ చేయాలని అన్నారు, ఈ సమావేశంలో ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు, మిట్టపల్లి పౌలు, ఖలిందర్ ఆలీ ఖాన్, తోకల సరస్వతి, దాగం మల్లేష్, కె.వీరభద్రయ్య, కొట్టే కిషన్ రావు, సుదర్శన్, సత్యనారాయణ, బాపు, రాజన్న, రాయమల్లు, సత్తయ్య పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు కాలువలో పడి వ్యక్తి మృతి

నవతెలంగాణ-జన్నారం

ప్రమాదవశాత్తు కాలువలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దేవునిగూడా గ్రామానికి చెందిన అజ్మీర రాంసింగ్(58) అనే పశువుల కాపరి గెదేలను మేపడానికి వెళ్లి ప్రమాదవశాత్తు కడెం కాలువలో పడి మృతి చెందాడు. మృతుడి కుమారుడు దేవ్ సింగ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాథోడ్ తానాజీ తెలిపారు.

కొండాపూర్ యాపలో రోడ్డు మరమ్మత్తులు

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని కొండాపూర్ యాపలో రోడ్డుకు దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ ఆధ్వర్యంలో మరమ్మత్తులు చేపట్టారు. కొండాపూర్ రహదారి పూర్తిగా ధ్వంసం కావడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కావడంతో పాటు వర్షపు నీరు అక్కడే నిలుస్తూ రహదారి కాస్త చెరువును తలపిస్తుండడంతో వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో ఓరియంట్ కంపెనీ ఆధ్వర్యంలో గుంతలలో కంకర నింపి రోడ్డు మరరమ్మత్తులు చేయడంతో సమస్య పరిష్కారం కావడంతో వాహనదారులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

ఉత్తమ ఉపాధ్యాయునికి ఘన సన్మానం

నవతెలంగాణ-జన్నారం

ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా కలెక్టర్ కుమార్ దీపక్ చేతులమీదుగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న కమాన్ పల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు షెఫీక్‌ని షాల్వాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు మహ్మద్ రియాజొద్దీన్, మాజీ కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ ఫసి ఉల్లా, పొన్కల్ మాజీ ఉప సర్పంచ్ మోసిన్ షా ఖాన్, నాయకులు రియాసత్ అలీ, ముత్యం రాజన్న, కొండపెల్లి మహేష్, ఎంప రజ్జాక్, ఏజాస్ ఉద్దీన్, మాక్సుద్ అలీ, షాకీర్ అలీ పాల్గొన్నారు.

బీసీ జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు కల్పించాలి

నవతెలంగాణ-జన్నారం



బీసీ జనాభాకు అనుగుణంగా ప్రభుత్వం రిజర్వేషన్లను పెంచాలని బీసీ సంఘం మండల నాయకులు కడార్ల నరసయ్య, మామిడి విజయ్ కోరారు. ఆదివారం పట్టణంలోని వాసవి నగర్‌లో బీసీ నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. దేశ జనాభాలో 55 శాతం పైగా బీసీ కులస్తులు ఉన్నారని, వారి జనాభా అనుగుణంగా రిజర్వేషన్లు లేవన్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీ కులస్తులకు ఎక్కువ సీట్లను కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో బీసీ సంఘం నాయకులు అప్పల జలపతి, సంధ్య వేణి, పవన్ కుమార్, మల్లేష్, రాజన్న, రవి పాల్గొన్నారు.

60వ వార్షిక క్రీడలను ప్రారంభించిన జీఎం



నవతెలంగాణ-మందమర్రి

సింగరేణి 60వ వార్షిక క్రీడలను డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ ఆధ్వర్యంలో ఆదివారం సిఈఆర్ క్లబ్‌లో ఏరియా జీఎం దేవేందర్ ప్రారంభించారు. పోటీలల్లో ఏరియా స్థాయిలో బాడీ బిల్డింగ్, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, షటిల్ బ్యాట్మెంటన్, టేబుల్ టెన్నిస్‌లను నిర్వహించారు. గెలుపొందిన క్రీడాకారులను రీజియన్ స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ సింగరేణి సంస్థ సి అండ్ ఎండీ బలరాం నాయక్ ఆదేశాల మేరకు సింగరేణి ఉద్యోగులకు ప్రతి ఏటా క్రీడలను నిర్వహించడం జరుగుతుందని, ఈ పోటీలలో పాల్గొన్న క్రీడాకారులు కళాకారులు కోల్ ఇండియా స్థాయిలో బహుమతులు సాధించి సింగరేణికి పేరు ప్రఖ్యాతలు తీసుకు వస్తున్నారని, సీనియర్ క్రీడాకారులు సంస్థలు పనిచేస్తున్న యువ ఉద్యోగులను క్రీడల వైపు ప్రోత్సహించాలని అన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసానికే కాక శరీర ధృఢత్వానికి తోడ్పడతాయని అన్నారు. ఉద్యోగి ఆరోగ్యంగా ఉన్నప్పుడే సంస్థ అభివృద్ధికి దోహదం చేసిన వారవుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, సీఎంఓఐ ప్రెసిడెంట్ సటుకూరి రమేష్, డీవైపీఎం మైత్రేయ బంధు, క్రీడల గౌరవ సెక్రటరీ ఎం కార్తీక్, రీజియన్ స్పోర్ట్స్ సూపర్‌వైజర్ సిహెచ్ అశోక్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ ఎస్ శివ కృష్ణ, బాడీ బిల్డింగ్ కెప్టెన్ ఎం వెంకటేశ్వర్లు, జనరల్ క్యాప్టెన్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మిలాద్ ఉన్ నభి ఉత్సవ కమిటీ సభ్యులతో ఎస్పీ సమావేశం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



మిలాద్ ఉన్ నభి ఉత్సవ కమిటీ సభ్యులతో ఆదిలాబాద్ వన్‌టౌన్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ గౌస్ ఆలం ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈనెల 16న నిర్వహించనున్న మిలాద్ ఉన్ నభి ర్యాలీని 19న నిర్వహించాలని, సభ్యులను జిల్లా ఎస్పీ కోరారు. ఈ విషయంపై ఉత్సవ సమితి సభ్యులు సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్పీ సురేందర్, డీఎస్పీ జీవన్‌రెడ్డి, సీఐలు కరుణాకర్, సునీల్ కుమార్ ఉన్నారు.

నిత్యావసర సరుకుల అందజేత

నవతెలంగాణ-బేల



ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని చప్రాల గ్రామానికి చెందిన తొడసం వామన్ ఇల్లు కూలిపోయింది. దీంతో నిత్యావసర సరుకులన్నీ నేలపాలయ్యాయి. తినడానికి తిండిలేని పరిస్థితి నెలకొంది. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి బాధిత కుటుంబానికి అండగా నిలిచి నిత్యావసర సరుకులను అందజేశారు. కాంగ్రెస్ పార్టీ పేదలకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఇందిరమ్మ ఇండ్ల కార్యక్రమం మొదలైన తర్వాత ముందుగా బాధిత కుటుంబానికి కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు సావాపురే విలాస్ పటేల్, గోపత్ శంకర్, రాక్రె సాగర్, మాజీ సర్పంచ్ మెస్రం దౌలత్, దిలీప్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

నవతెలంగాణ-నార్నూర్

ఇటీవల జైనూర్‌లో ఆదివాసీ మహిళపై లైంగికదాడికి పాల్పడిన నిందితుడిని ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారణ చేపట్టి కఠినంగా శిక్షించాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రాయిసెంటర్ తొమ్మిది ఆదివాసీ సంఘాల నాయకులు ఆదివారం మండలంలోని మాన్కాపూర్ గ్రామంలో సమావేశంలో తీర్మానించారు. 1970లో వలస వచ్చిన ముస్లిం మైనారిటీలకు భూ యాజమాన్య హక్కు పత్రాలు రేషన్ కార్డు, ఆధార్ కార్డు, కరెంట్ బిల్లు వెంటనే రద్దు చేసి, జైనూర్ ఏజెన్సీ ప్రాంతం నుంచి ప్రభుత్వమే వారిని అక్కడి నుంచి తరలించాలన్నారు. ముస్లిం మైనార్టీ అధికారులు అక్కడి నుంచి వెంటనే బదిలీ చేయాలన్నారు. ఈనెల చివరి వరకు తెలంగాణ ప్రభుత్వం స్పందించని, యెడల పంచాయతీరాజ్ చట్టం పేసా చట్టం ప్రకారం.. మా ఊరిలో మా రాజ్యం ప్రకటిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా సార్మెడి దుర్గు పటేల్, బూర్సా పోచయ్య, కోడల నగేష్, గొడం గణేష్, కొట్నాక్ విజయ్, పుర్కా బాపురావ్, కోవా విజయ్, కనక ప్రభాకర్, పెందూర్ పుష్పరాణి, ఆర్కా ఖమ్ము, వెట్టి మనోజ్, జుగ్నాక్ భీంరావ్, దౌలత్ రావ్, భగ్వాన్ షావ్ ఉన్నారు.

పాము కాటుతో యువకుడు మృతి

నవతెలంగాణ-తాంసి

పాము కాటుకు గురై యువకుడు మృతి చెందిన సంఘటన శనివారం భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి గ్రామంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన పెద్దింటి ప్రభు(26) గత ఐదు రోజుల కింద వ్యవసాయ పంట క్షేత్రంలో పనులు చేస్తున్న క్రమంలో పాము కాటు వేసింది. వెంటనే గమనించి 108 వాహనంలో చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున ఉదయం మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. అందరితో కలివిడిగా ఉండే ప్రభు పండగ పూట మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

లైంగికదాడికి పాల్పడిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలి

నవతెలంగాణ-ఉట్నూర్

జైనూర్‌లో ఆదివాసీ మహిళాపై లైంగికదాడికి పాల్పడిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని, టీజేపీ లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ జి.రామారావు అన్నారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతంలో ఇలాంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా పోలీసులు చూడాలని కోరారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి, విచారణ చేపట్టాలన్నారు. మేము హైదారాబాద్ నుంచి జైనూర్ పరిస్థితులపై విచారణ కొరకు వెళ్తే పోలీసులు మాకు అడ్డుకున్నారని, ఇది సరైన నిర్ణయం కాదని, పోలీసులు అప్రమత్తంగా ఉంటే ఇలాంటి ఘటనలు జరగవని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ ఆంథోనిరెడ్డి, ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లా లీగల్ సెల్ కన్వనర్ బానోత్ జగన్, నిర్మల్ జిల్లా లీగల్ కన్వీనర్ రామన్న, వెంకటేష్, జనార్ధన్, శ్రీకాంత్, ప్రవీణ్, రామారావు, నగేష్, శ్రీనివాస్, మల్లేష్, వెంకటేష్, నర్సింగ్‌రావు అన్నారు.

బీసీ కమీషన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన నాయకులు

నవతెలంగాణ-బోథ్

హైదారాబాద్‌లోని గాంధీభవన్‌లోని బీసీ కమీషన్‌ను వ్యవసాయ కమీషన్ కోదండరెడ్డి, బీసీ కమీషన్ జీవన్‌రెడ్డిలను బోథ్ కాంగ్రెస్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ మల్లెపూల సత్యనారాయణ, మాజీ సర్పంచ్ బురుగు మల్లేష్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. బోథ్ నియోజకవర్గంలోని ఆయా సంఘాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కాంగ్రెస్ ఎన్నికల సమయంలో దివ్యాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక(ఎన్‌పీఆర్‌డీ) జిల్లా అధ్యక్షుడు మేస్రం నగేష్ అన్నారు. ఆదివారం పట్టణంలోని సుందరయ్య భవనంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంఘం సభ్యులతో కలిసి మాట్లాడారు. దివ్యాంగుల సంక్షేమాన్ని ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో దివ్యాంగులకు రూ.6 వేలు పింఛన్ పెంచి ఇస్తామని చెప్పి ఇంతవరకు దాన్ని అమలు చేయడంలేదని దుయ్యబట్టారు. ఇంకా అనేక సమస్యలతో దివ్యాంగులు సతమతమవుతున్నారని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యల సాధనకు సోమవారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం నాయకులున్నారు.

రోల్‌మామడ బ్రిడ్జి వద్ద రోడ్డు ప్రమాదం

నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని రోల్‌మామడ వద్ద జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... నిర్మల్ నుంచి నాందేడ్ వైపు కుటుంబ సభ్యులతో వెళుతున్న షిఫ్ట్ డిజైర్ కారు మండలంలోని రోల్‌మామడ జాతీయ రహదారి వద్ద బ్రిడ్జిపై నుంచి కారు పల్టీలు కొట్టి కాలువలు పడటంతో కారులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు తీవ్ర గాయాలతో బయటపడ్డారు. ఈ కారులో నలుగురు చిన్న పిల్లలు, ముగ్గురు మహిళలు, ముగ్గురు పురుషులు ఉన్నారని, వారిని చికిత్స నిమిత్తం హైవే అంబులెన్స్‌లో నిర్మల్ ఏరియా ఆస్పత్రికి తరలించినట్టు స్థానికులు తెలిపారు.

బాధితులకు పరామర్శ

నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రానికి చెందిన మాజీ ఎంపీటీసీ కుర్మే మహేందర్, అపేపు కిరణ్ ఇటీవల బైక్‌పై నుంచి పడి ప్రమాదవశాత్తు పడి గాయాలయ్యాయి. శనివారం కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకుడు ఏలేటి అశ్విన్‌రెడ్డి పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మండల నాయకులు నల్ల శ్రీకాంత్‌రెడ్డి, మెరుగు భోజన్న, బారే నాగేందర్, గుడాల అనీష్, మహేష్ పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో వినాయక చవితి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వినాయక చవితి పర్వదినం సందర్భంగా భక్తుల పూజలు అందుకునేందుకు గణనాథుల తరలింపుతో వీధులు శోభాయమానంగా మారాయి. ఊరేగింపులు... బ్యాండు మేళాల చప్పుళ్లతో పట్టణంలో పండుగ కళ ఉట్టిపడింది. ఏకదంతుడిని ఇండ్లలో పూజించుకునేందుకు భక్తులు మండపాల్లో ప్రతిష్టాపనకు యువకులు, మండపాల నిర్వాహకులు పెద్ద ఎత్తున మార్కెట్లకు తరలివచ్చి బొజ్జ గణపయ్య ప్రతిమలను కొనుగోలు చేసేందుకు పోటీ పడ్డారు. నెలరోజుల ముందుగానే తమకు నచ్చిన ఆకారాలు, సైజుల్లో వినాయక విగ్రహాల తయారీకి ఆర్డర్లు పెట్టుకున్న మండపాల నిర్వాహకులు శనివారం పర్వదినం సందర్భంగా వాటిని తరలించేందుకు ప్రత్యేక ఏర్పాట్లతో తరలివచ్చారు. దీంతో పట్టణంలోని అంబేద్కర్‌చౌక్‌లోని మున్నూరుకాపు సంఘ భవనం తిర్పెల్లిలోని నకాశి కళాకారుల నివాసాలు, నేతాజీచౌక్, దస్నాపూర్, మావలల్లో వెలిసిన పీఓపీ విగ్రహాల తయారీ దుకాణాల వద్ద సందడి నెలకొంది. ఆయా చోట్ల నుంచి భారీ విగ్రహాలను క్రేన్ల సాయంతో వాహనాల్లో ఎక్కించారు. కొన్నింటిని యువకులే సామూహికంగా వాహనాల్లోకి ఎక్కించి తీసుకువెళ్లారు. చిన్నారులు తాము సైతం అంటూ చిట్టిపొట్టి గణపయ్యలను తమ మండపాలకు తరలించారు. పట్టణంతో పాటు పల్లెల నుంచి విగ్రహాల తరలింపునకు పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావడంతో రోడ్లన్నీ కిక్కిరిశాయి.

కిటకిటలాడిన ఆదిలాబాద్ పట్టణం

వినాయక చవితి వేడుకలతో పట్టణం శోభాయమానమైంది. ఆదిదేవుడి పూజకు అవసరమైన సామాగ్రి కొనుగోళ్లకు భక్తజనం మార్కెట్ల దారి పట్టడంతో పట్టణంలోని ప్రధాన రోడ్లన్నీ కిటకిటలాడాయి. వినాయక ప్రతిమలతో పాటు పండుగ సామాగ్రి కొనుగోళ్లతో ఆయా కూడళ్ల శనివారం సందడిగా కనిపించాయి. పట్టణంలోని అంబేద్కర్‌చౌక్, గాంధీచౌక్, దేవిచంద్‌చౌక్, వినాయక్‌చౌక్‌తో పాటు రైతుబజార్ ప్రాంతమంతా కొనుగోలు దారులతో కిక్కిరిశాయి. పండుగకు అవసరమైన పూలు, బిల్వపత్రాలు, మారేడు కాయలు, టేకు పూలు, మామిడి కొమ్మలు, 21 రకాల కాయగూరలు, పండ్లు, ఇతర పూజా సామాగ్రి కొను గోళ్లకు జనం పోటెత్తారు. అటు బొజ్జ గణపయ్యకు నైవేద్యంగా అర్పించేందుకు లడ్డూల కొనుగోళ్లతో స్వీట్ హౌజ్లు కిటకిటలాడాయి. కిలో నుంచి 10 కిలోల వరకు లడ్డూల తయారీతో వ్యాపారులు ప్రత్యేకతను చాటగా గణేష్ మండపాల నిర్వాహకులు పోటీ పడి వాటిని కొనుగోలు చేశారు.



పూజా సామాగ్రి కొనుగోలు చేస్తున్న భక్తులు



గణపతి విగ్రహాలతో భక్తులు

విగ్రహాల కొనుగోలు కోసం పోటీ..

స్వచ్ఛంద, ధార్మిక సంస్థలు పర్యావరణ పరిరక్షణ కోసం ఉచితంగా మట్టి విగ్రహాల పంపిణీ చేపట్టినప్పటికీ భక్తులు తమ సాంప్రదాయానికి అనుగుణంగా సొంతంగా విగ్రహాలను కొనుగోలు చేసేందుకు ఆసక్తిచూపారు. దీంతో ఏ వీధిలో చూసిన రంగు రంగుల వినాయక ప్రతిమల కొనుగోళ్లు జోరుగా సాగాయి. ఇక మట్టి ప్రతిమల కోసం అశోక్ రోడ్డులో గల నకాశి కళాకారుల వద్దకు చేరుకొని కొనుగోలు కోసం బారులు తీరారు. అటు పండుగకు అవసరమైన కూరగాయలు, ఇతర సామాగ్రి కొనుగోళ్లతో దుకాణాలు రద్దీగామారాయి. దీంతో పట్టణంలో ఎటు చూసినా పండుగ సందడి కనిపించింది.

గణనాథుడికి భక్తి శ్రద్ధల నడుమ పూజలు

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదిదేవుడిగా పూజలందుకునే బొజ్జగణపయ్యలను భక్తజనం భక్తి శ్రద్ధలనడుమ ప్రతిష్టించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని కైలాస నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గణనాథుడి ప్రతిష్టాపన పూజాకార్యక్రమం వైభవంగా సాగింది. వేదపండితుడు ప్రవీణ్ శర్మ వేద మంత్రాల నడుమ ఎమ్మెల్యే పాయల శంకర్ పార్టీ శ్రేణులతో కలిసి పార్వతి తనయుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. లంబోధరుడి కృపతో నియోజక వర్గ ప్రజలందరికీ ప్రతి పనిలో విజయం చేకూరాలని, వారందరికి ఆనందోత్సాహాలు సంపూర్ణ ఆరోగ్యం కలిగించాలని ఆకాంక్షించారు.

సమితి ఆధ్వర్యంలో విగ్రహప్రతిష్ఠపన..

మరోవైపు యేటా పట్టణంలో చేపట్టే గణేష నవరాత్రి ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో శోభాయమానంగా నిర్వహించే హిందూ సమాజ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో గణనాథుడి ప్రతిష్ఠాపన కార్యక్రమం వైభవంగా సాగింది. స్థానిక వినాయక్ చౌక్ సరస్వతి శిశు మందిరంలో ఉత్సవ సమితి ప్రతినిధులు ఏకదంతుడిని శోభాయాత్రగా తీసుకువచ్చి ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ సమితి ప్రతినిధులు హన్మాండ్లు, కోరెడ్డి లెనిన్, దినేష్ మటోలియా, శ్రీనివాస్, విహెచ్‌పీ నాయకులతో పాటు శిశుమందిరం అధ్యాపక బృందం చిన్నారులు పాల్గొని భక్తి శ్రద్దలతో పూజలు చేశారు.

ఆలయంలో ఘనంగా వినాయక బ్రహ్మోత్సవాలు...

రిమ్స్ ఆస్పత్రి ఆవరణలో స్వయంభూగా వెలిసిన మహాగణపతి ఆలయంలో వినాయక బ్రహ్మోత్సవాలు వైభవంగా ఆరంభమయ్యాయి. హిందూత్వ సంస్థల ప్రతినిధులు, భక్తులు ప్రత్యేక పూజల నడుమ ఆలయంలో బొజ్జ గణపయ్యను ప్రతిష్ఠించి శాస్త్రోక్త పూజలు నిర్వహించారు.

మట్టి గణపతులను పంపిణీ చేసిన మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్...

వినాయక చవితి పర్వదినాన్ని పుస్కరించుకొని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ రంగినేని మనీషాపవన్ రావుల ఆధ్వర్యంలోనూ మట్టి గణపతులను పంపిణీ చేశారు. స్థానిక అంబేద్కర్‌చౌక్‌లో ప్రజలకు మట్టి విగ్రహాల ప్రాధాన్యత కలిగే లాభాలను వివరిస్తూ విగ్రహాలను అందించారు.

గణనాథుడికి మాజీ మంత్రి పూజలు...

మాజీ మంత్రి జోగు రామన్న పట్టణంలోని శాంతినగర్‌లోని తన నివాసంలో మట్టి వినాయకుడి ప్రతిష్ఠాపించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సాయిబాబా ఆలయంలో ప్రతిష్ఠాపించిన వినాయకుడికి సతీమణి జోగు రమతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఇజ్జగిరి నారాయణ, రాజన్న, కుమ్ర రాజు, ధారవేణి రాము, లక్ష్మణ్, రాజు, సంతోష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కంది కార్యాలయంలో గణేషుడికి పూజలు..

కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌ఛార్జి కంది శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయంలో వినాయక చవితి వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రజా సేవాభవన్ ప్రాంగణంలో నెల కొల్పిన వినాయక మండపంలో గణనాథుడికి కంది శ్రీనివాసరెడ్డి దంపతులు కూతురు కంది అరికరెడ్డితో హాజరై శనివారం తొలి పూజలు నిర్వహించారు.

52 అడుగుల గణనాథుడికి పూజలు

జిల్లా కేంద్రంలో కుమార్ జనతా గణేష్ మండల్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన 52 అడుగుల భారీ వినాయకుడిని శనివారం సాయంత్రం ఎంపీ నగేష్, ఎమ్మెల్యే పాయల శంకర్ దర్శించుకున్నారు. ముందుగా గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులను అభినందించారు. అనంతరం ఎంపీ, ఎమ్మెల్యేను గణేష్ మండలాల నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఇదిలా ఉంటే భారీ మహాగణపతిని సందర్శనకు భక్తులు బారులు తీరారు.

గణనాథుడిని దర్శించుకున్న ఎస్పీ, డీఎస్పీ...

రాష్ట్రంలోనే ప్రసిద్ధిగాంచిన అతి ఎత్తైన గణపతిలలో ఒకటైన ఆదిలాబాద్ పట్టణంలోని కుమార్ జనతా గణపతి మండలి వద్ద 52 అడుగుల ఎత్తైన గణపతిని ఎస్పీ గౌస్ ఆలం, డిఎస్పీ జీవన్ రెడ్డి దర్శించి, విగ్రహానికి పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు జిల్లా ఎస్పీకి సాదరంగా స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు.



గణపతికి పూజలు చేస్తున్న ఎంపి, ఎమ్మెల్యే



గణేషుడికి పూజలు చేస్తున్న కంది శ్రీనివాస్



గణనాథుడికి పూజలుచేస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

కొలువుదీరిన గణనాథులు

నవతెలంగాణ-కుభీర్

మండలంలోని పార్డి(బి), పల్సి, సొనారితో పాటు ఆయా గ్రామాల్లో శనివారం గణనాథులు కొలువుదీరారు. మహారాష్ట్రలోని బోకర్ తాలూకా పాలజ్ గ్రామంలో కర్ర గణేష్ విగ్రహాలను ప్రతిష్ఠించారు. 9రోజుల పాటు పూజలందుకొని భక్తులు కోరిన కోరికలు తీర్చే పాలజ్ గణేశున్ని దర్శించుకోవడానికి తెలంగాణ రాష్ట్రంతో పాటు మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ తదితర ప్రాంతాల నుంచి అధిక మొత్తంలో భక్తులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. 11రోజుల పాటు పూజలందుకొని చివరి రోజున గ్రామానికి సమీపంలో ఉన్న వగులోకి వెళ్లి గణేశునికి నీళ్ల చల్లుకుని మందిరానికి తీసుకువచ్చి బీరువాలో భద్రపరుస్తారు.

పసుపుతో గణపతి పర్యావరణ పరిరక్షణకు వినూత్న ప్రయత్నం

మండలంలోని పార్డి(బి) గ్రామంలోని ఎల్పీఎం పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు చిరంజీవి పర్యావరణ పరిరక్షణను కాపాడాలనే ఉద్దేశ్యంతో శనివారం గణేష్ నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా పసుపుతో కూడిన గణేష్ విగ్రహాన్ని తయారు చేసి, పాఠశాలలో ప్రతిష్ఠించారు. దీంతో గ్రామంలో ఉన్న ప్రజలు యువకులు, విద్యార్థులు ఎంతో ఆసక్తిగా గణేశున్ని దర్శించుకున్నారు. అదే విధంగా ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ వల్ల అనేక విధాలుగా నష్టం జరుగుతున్న సందర్భంగా కొన్ని గ్రామాల్లో కర్ర వినాయకుడిని తయారు చేసి పూజలు చేయడం జరుగుతుందన్నారు. పార్డి(బి) గ్రామంలో పల్సి, కుభీర్ విఠలేశ్వర్ ఆలయంలో కర్ర వినాయకుని ప్రతిష్ఠించి పూజలు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్ మాట్లాడుతూ పసుపుతో తయారు చేసిన గణేష్ విగ్రహం కొత్త ప్రయత్నం పర్యావరణ కాలుష్యం నియంత్రించేందుకు సహాయపడుతుందని అన్నారు.



కుభీర్



ఇంద్రవెల్లి

ఇంద్రవెల్లి : వినాయక చవితిని మండల ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. వినాయకుడి విగ్రహాలను వివిధ వాహనాల్లో తమ తమ గ్రామాలకు తరలించారు. కుటుంబీకులు తమ ఇండ్లల్లో చిన్న చిన్న బొప్ప విగ్రహాలను కొనుగోలు చేయడంలో నిమగ్నమయ్యారు. ఆ గణనాథుడి పూజకు ఉపయోగించే పూజ సామగ్రితో మార్కెట్ కళ కళ లాడింది. ఈ సందర్భంగా వివిధ వాడల్లో గణేషుడి విగ్రహ స్థాపన కోసం మండపాలను అలంకరించారు. సాయంత్రం వేళ వినాయకుడికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం లంబోధరుడు విగ్రహాన్ని ప్రతిష్ఠాపన చేశారు. ఎక్కడ చూసిన వినాయకుడి విగ్రహాలతో కళ కళ లాడాయి.

పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలి

- టీయూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మ లచ్చిరాం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేయాలని టీయూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మ లచ్చిరాం డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని సంఘ భవనంలో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 5 డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని వెంటనే విడుదల చేయాలని కోరారు. అదేవిధంగా పీఆర్సీ నివేదికను తెప్పించుకొని అమలు చేయాలన్నారు. 317 జీఓ ప్రకారం చాలామంది ఉపాధ్యాయులు స్థానికేతరులుగా వేరే జిల్లాలలో పనిచేస్తున్నారని వెంటనే వారిని సొంత జిల్లాలకు తీసుకురావాలని కోరారు. నిలిచిపోయిన 13 జిల్లాల స్పౌజ్ బదిలీలు చేపట్టాలని, ఇటీవల జరిగిన బదిలీల సందర్భంగా సాంకేతిక పొరపాట్లతో నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సర్వీస్ రూల్స్ సమస్యను పరిష్కరించి ఎంఈఓ, డైట్ లెక్చరర్ ఉద్యోగోన్నతులు కల్పించాలని, ప్రభుత్వ విద్య బలోపేతానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షులు బేర దేవన్న, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.శ్రీకాంత్, ఎం.జలందర్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంకట్‌రావు, ఏ.భూమన్న పాల్గొన్నారు.

అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం

నవతెలంగాణ-తాంసి

రెండు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి శవమై కలకలం రేపింది. భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి గ్రామానికి చెందిన జానకొండ నారాయణ(38) ఈనెల 5న జిల్లా కేంద్రం ఆదిలాబాద్‌కు వెళ్లి ఇంటికి సరుకులు తీసుకువస్తానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరాడు. రెండు రోజులైనా భర్త ఇంటికి రాకపోవడంతో భార్య విజయలక్ష్మి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్సై కరీం కేసు నమోదు చేసుకున్నారు. ఇదిలా ఉండగా మహారాష్ట్ర కిన్వట్ తాలూకా మండ్వి పోలీస్ స్టేషన్ పరిధిలోని పిప్పలగావ్ అటవీ ప్రాంతంలో ఆదివారం కాలిపోయిన మృతదేహం ఉన్నట్లు మహారాష్ట్ర పోలీసులు గుర్తించి భీంపూర్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. అదృశ్యమైన కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి గుర్తించారు. శవ పంచానామ నిర్వహించి అనుమానాస్పద మృతిగా మహారాష్ట్ర పోలీసులు కేసు నమోదు కేసు నమోదు చేశారు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలున్నారు.

తిరుపతిలో తప్పిపోయి పన్నెండెండ్లకు ఇంటికి చేరి..

నవతెలంగాణ-బోథ్

మండలంలోని గుట్టపక్కతండా గ్రామానికి చెందిన సిసోదియా తుకారాం 12సంవత్సరాల కింద తిరుమల తిరుపతిలో తప్పిపోయి శనివారం స్వగ్రామానికి చేరుకున్నాడు. పెద్ద కుమారుడు సుందల్ సింగ్ తెలిపిన వివరాల ప్రకారం.. 2012వ సంవత్సరంలో తన అమ్మనాన్నను తిరుమల తిరుపతి దేవస్థానం దర్శనానికి తీసుకు వెళ్లాడు. అక్కడ పాపనశి నదిలో స్నానం చేసి హత్తీరాం బాబా మందిరం దగ్గర పూజలో తప్పిపోయాడు. వారం రోజులు వెతికినా దొరకలేదు. అయినప్పటికీ సంవత్సరం పాటు వెతికినా దొరకక పోవడంతో చివరికి చనిపోయాడని అనుకున్నారు. అలాగే ఆయనను పెద్దకూతురు సునీత హైదారాబాద్‌లోని దుస్తుల కంపనీలో పనిచేస్తుంది. అక్కడ బోండా మార్కెట్‌లో వస్తువులు కొనేందుకు వెళ్లారు. అక్కడ బిచ్చం అడుగుతూ కనిపించాడు. అనుమానం రావడంతో దగ్గరకు వెళ్లి చూసినట్టు తెలిపారు. అయినా రెండురోజులు గమనించి, వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించింది. దీంతో కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లి పలకరిస్తే మాట్లాడం లేదు. మతిస్థిమితం కోల్పోయి ఉండటంతో అనుమానం వచ్చి ఆయనకు ఉన్న ఆదార్ కార్డుతో వేలిముద్రతో బయోమెట్రిక్ చేయిస్తే ఆయన ఆధార్ కార్డుకు వేలు ముద్ర సరిగా ఉండటంతో తమ తండ్రి అని గుర్తు పట్టి 7న శనివారం స్వగ్రామం ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని గుట్ట పక్క తండ గ్రామానికి చేరుకున్నారు. దీంతో కుటుంబీకులు గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. అలాగే మతిస్థిమితం కోల్పోయి ఉండటంతో ప్రభుత్వం ఏదైనా సహాయ సహకారాలు అందించాలని కుటుంబీకులు కోరారు.